- వరప్రదాయిని సాకారంపై రైతుల నమ్మకం
- అటకెక్కిన గోదావరి జలాల తరలింపు పథకం
- ఐదేళ్లుగా వివక్ష చూపారని సీఎం జగన్‌పై ఆగ్రహం
- సాగర్ ఆయకట్టులో సాగు సంక్షోభమైనా పట్టని పాలకులు
- 9.61 లక్షల ఎకరాలకు సాగునీటి భరోసా పథకంపై నిర్లక్ష్యం

9.61 లక్షల ఎకరాలకు సాగునీరు.. 679 చెరువులు, వందల గ్రామాలకు తాగునీరు.. సాగర్ ఆయకట్టులో తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా.. గోదావరి జలాలను సాగర్ ఆయకట్టు తరలించేందుకు గత టీడీపీ ప్రభుత్వం ఎత్తి పోతల పథకానికి శ్రీకారం చుట్టింది. అయితే వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత వరప్రదాయిని లాంటి పథకంపై వివక్ష చూపింది. ఐదేళ్లుగా సీఎం జగన్‌మోహనరెడ్డి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా పనులు నిలిపివేశారు. పైగా వైఎస్ఆర్ పల్నాడు కరవు నివారణ పథకంగా పేరు మార్చారే కాని పనులపై దృష్టి సారించలేదు. ఈ పరిస్థితుల్లో మళ్లీ చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తేనే గోదావరి జలాలు సాగర్ ఆయకట్టుకు వస్తాయని.. తమకు నీటి కష్టాలు తీరతాయని రైతులు, గ్రామీణులు విశ్వసిస్తున్నారు.

చంద్రన్నతోనే.. గోదావరి!

3,437 ఎకరాల భూసేకరణ చేయాలి

పథకం పనుల కోసం 3,437 ఎకరాల భూమి అవసరమవుతుందని అంచనా వేశారు. ఇందుకు సంబంధించిన సర్వే కూడా పూర్తి చేశారు. అమరావతి, పెదకూరపాడు, క్రోసూరు, రాజుపాలెం మండలాల నుంచి నకరికల్లు మండలంలోని సాగర్ కుడి ప్రధాన కాలువ వరకు భూసేకరణకు రూ.955 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. భూసేకరణకు సంబంధించిన ప్రకటనను కూడా రెవెన్యూ శాఖ జారీ చేసింది. ఇందుకు నిధులు విడుదల కాకపోవడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఎత్తిపోతల పథకం పనులను రెండు ప్యాకేజీలుగా విభజించి కాంట్రాక్టర్లకు ప్రభుత్వం అప్పగించింది. రూ.2281 కోట్లతో ఒక ప్యాకేజీ, రూ.2655 కోట్లతో రెండో ప్యాకేజీగా నిర్ణయించి ఇద్దరు కాంట్రాక్టర్లకు పనులు ఇచ్చారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టలేదు. ఎంతో ప్రాధాన్యం కలిగిన ఎత్తిపోతల పథకానికి నిధులు విడుదల చేయకుండా నిలిపివేయడంపై అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ఎత్తిపోతల పథకానికి నాటి సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కృష్ణమ్మలో బిరబిరా పరుగులు లేవు. ఆయకట్టులో బంగారు పంటల ఆనవాళ్లు లేవు. నాగార్జునసాగర్ జలాశయంలో జలకళ లేదు. సాగునీటి కష్టాలతో ఆయకట్టు అల్లాడుతోంది. లక్షల ఎకరాల్లో రైతులు నీటి తడుల కోసం తంటాలు పడుతున్నారు. పంటల సాగు సందిగ్ధంలో పడింది. ఈ పరిస్థితిని గత టీడీపీ ప్రభుత్వం ముందస్తుగానే ఊహించి సాగర్ ఆయకట్టులో సాగు, తాగునీటి కష్టాలను శాశ్వతంగా పరిష్కరించేలా గోదావరి జలాలను తరలించే పథకానికి శ్రీకారం చుట్టింది. ఈపథకం సాగర్ ఆయకట్టుకు వరప్రదాయినిగా రూపొందించింది. అప్పటి సీఎం చంద్రబాబు నిధులు కేటాయించి శంకుస్థాపన కూడా చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వరప్రదాయనిలాంటి పథకంపై వివక్ష చూపింది. భూసేకరణ సహా ఇతర పనులన్నింటినీ అటకెక్కించింది. సాగర్ కుడి కాలువ ఆయకట్టుకు వరప్రదాయనిగా నిలిచే పథకంపై ప్రభుత్వం శీతకన్ను వేయడంపై పల్నాడు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లావాసుల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఈ పథకం పట్ల జగన్ వ్యవహరించిన తీరును అన్నదాతలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఐదేళ్ల సీఎం జగన్‌మోహనరెడ్డి రూపాయి కూడా ఖర్చు చేయకుండా పనులు నిలిపివేయడంపై మండిపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వస్తేనే గోదావరి జలాలు సాగర్ ఆయకట్టు వస్తాయని రైతులు బలంగా విశ్వసిస్తున్నారు. ఆయనే అధికారంలోకి రావాలని అన్నదాతలు కోరుకుంటున్నారు.

ఎనిమిదేళ్లలో మూడేళ్లు కరువు

ఎనిమిదేళ్లలో మూడు సంవత్సరాలు సాగర్ ఆయకట్టులో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. కుడి కాలువకు గోదావరి జలాలు అందుతాయన్న భరోసా నాలుగు జిల్లాల ప్రజల్లో సన్నగిల్లుతున్నది. గోదావరి జలాల తరలింపు పథకంతో పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో 9,61231 వేల ఎకరాలకు సాగునీరు, 679 చెరువులకు తాగునీరు అందించేలా గోదావరి జలాల ఎత్తి పోతల పథకం రూపొందించారు. పట్టిసీమ పథకం ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు సరఫరా చేస్తుండటంతో ఆ ప్రాంతంలో రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం ఏర్పడింది. ఇదే తరహాలో సాగర్ కుడి కాలువ ఆయకట్టుకు కూడా గోదావరి జిలాలతో మహర్దశ పట్టేది. కుడి కాలువ ప్రాంతానికి గోదావరి, పెన్నా అనుసంధానం పథకం పూర్తి జీవం పోస్తుంది. అయితే వైసీపీ ప్రభుత్వం ఈ పథకంపై వివక్ష చూపింది. దీంతో సాగర్ ఆయకట్టులో సాగునీటి సంక్షోభవంతో రెండేళ్లగా పంటలు పండని పరిస్థితి నెలకొంది. అదే ఈ పథకం పూర్తి చేసి ఉంటే గోదావరి జలాలతో పంటలు పండేవని రైతుల అభిప్రాయం. ఈ ఎత్తిపోతల పథకం పూర్తి చేయటం ద్వారా రోజుకు ఏడు వేల క్యూసెక్కుల నీళ్లు కుడి కాల్వకు అందేవి. ఈ పథకం పూర్తయితే ఆయకట్టులో సాగు చిత్రం పూర్తిగా మారేదని కానీ వైసీపీ ప్రభుత్వ తీరు తమకు శాపంలా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గోదావరి జలాలు నాగార్జున సాగర్ కుడి కాల్వలో కలిసే ప్రదేశం ఇదే

పేరు మార్చి పట్టించుకోలేదు..

గోదావరి జలాల తరలింపు పథకానికి తన తండ్రి వైఎస్ఆర్ పేరు పెట్టుకోవడంలో ముఖ్యమంత్రి కాగానే జగన్ చూపిన శ్రద్ధ పథకం నిర్మాణంపై కనబరచలేదు. టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభమైన ఎత్తిపోతల పథకం పనులను జగన్ నిలిపేశారు. ఈ పథకం నిర్మాణానికి రూ.6,020 కోట్లు నిధులు కేటాయించినట్లు 2020లో ప్రభుత్వం ప్రకటించింది. అయితే నిధుల విడుదలను జగన్ ప్రభుత్వం విస్మరించింది. దీంతో భూసేకరణ నిలిచిపోయింది. పంపుహౌస్ నిర్మాణ పనులను కాంట్రాక్టర్లు నిలిపివేశారు. పథకం నిర్మాణానికి భూసేకరణ ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందాన మారింది. ఐదేళ్లుగా పనులు ముందుకు సాగకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

చంద్రబాబుతోనే సాకారం

గోదావరి పెన్నా నదుల అనుసంధానం ఆంధ్రప్రదేశ్ వరప్రదాయని. దశాబ్దాల కలది. ఆంధ్రప్రదేశ్ విభజనతో నీటి సంక్షోభ ప్రమాదాన్ని చంద్రబాబు ఊహించారు. విభజిత రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గోదావరి పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా తొలిదశలో గోదావరి జలాలను నాగార్జున సాగర్ ఆయకట్టుకు తరలించాలని నిర్ణయించారు. గోదావరి జలాల తరలింపు ద్వారా సాగర్ కుడి కాల్వ ఆయకట్టులో నెలకొనే సాగు నీటి సంక్షోభానికి శాశ్వత పరిష్కారంగా గుర్తించారు. దీంతో 2018లో నకరికల్లు వద్ద గోదావరి జలాలను సాగర్‌కు తరలించే ఎత్తిపోతల పథకానికి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. అయితే ప్రభుత్వం మారడంతో ఈ పథకం మూలనపడింది. పైగా ఈ పథకానికి సీఎం జగన్ తన తండ్రి పేరుతో వైఎస్ఆర్ పల్నా డు కరవు నివారణ పథకంగా మార్చారే కాని ఐదేళ్లుగా పట్టించుకోలేదు. ఈ పరిస్థితుల్లో రానున్న ఎన్నికల్లో మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే ఆయన శంకు స్థాపన చేసిన పథకం పూర్తి అవు తుంద ని.. తమ నీటి కష్టాలు తీరతా యని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లావాసులు ఎదురుచూస్తున్నారు.

ఉత్తుత్తి హామీలు.. చెవిలో పూలు

- చిలకలూరిపేటపై వరాల జల్లు కురిపించిన సీఎం జగన్
- ఏళ్ల తరబడి నెరవేరని హామీలు


పునరుద్ధరణకు నోచుకోని కొండవీడు కోటలోని కట్టడాలు

చిలకలూరిపేట, ఏప్రిల్ 20: చెల్లెమ్మ రజిని అడిగిందంటూ చిలకలూరిపేట నియోజకవర్గంపై ముఖ్యమంత్రి జగన్ వరాల జల్లు కురిపించి ఇప్పటికీ ఏడాది గడిచింది. ఆ హామీలు హామీలుగానే మిగిలాయి. గత ఏడాది ఏప్రిల్ 6వ తేదీన ముఖ్యమంత్రి హోదాలో జగన్ చిలకలూరిపేట నియోజకవర్గంలోని లింగంగుంట్ల గ్రామంలో పర్యటించారు. అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి అయిన చిలకలూరిపేట శాసనసభ్యురాలు విడదల రజిని ఆ సభలో నియోజకవర్గ సమస్యల గురించి సీఎం ఎదుట ప్రస్తావించారు. పలు అభివృద్ధి పనులకు ఆర్థిక సహాయం అందించాలని మంత్రి విడదల రజిని ఆ సభలో సీఎంను కోరారు.

చిలకలూరిపేటలో ప్రధానంగా మంచినీటి సమస్య ఉంది. పట్టణంలో రోజు మార్చి రోజు మాత్రమే నీటి సరఫరా జరుగుతోంది. రెండు మంచినీటి చెరువులు ఉన్నప్పటికీ నీటి సమస్య ఏళ్ల తరబడి నెలకొని ఉంది. ఈ నేపథ్యంలో నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఎంతో కృషి చేసి అమృత్ పథకం చిలకలూరిపేటకు మంజూరయ్యేలా చేశారు. 35 శాతం పనులు కూడా పూర్తి చేయించారు. జగన్ ప్రభుత్వం వచ్చాక అమృత్ పథకంలో ముఖ్యమైన ప్రధాన పైపులైన్ నిర్మాణపు పనులు నిలిచిపోయాయి. అమృత్ పథకం పనులకు రూ.63 కోట్లు విడుదల చేస్తామని సీఎం జగన్ తన పర్యటన సందర్భంగా ప్రకటించారు. రూపాయి కూడా విడుదల కాలేదు. ఎస్సీలకు అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్, బీసీలకు బీసీ భవన్, కాపులకు కాపు భవన్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. చిలకలూరిపేట ప్రాంతంలో ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తామని సీఎం చెప్పారు. తాతపూడి వద్ద ముస్లిం మైనారిటీలకు రెసిడెన్షియల్ స్కూలు నిర్మిస్తామన్నారు. ఈ హామీలు ఇంతవరకు అమలుకు నోచుకోలేదు.

2019 ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేతగా చిలకలూరిపేట కళామందిర్ సెంటర్‌లో జరిగిన ఎన్నికల సభలో జగన్ మాట్లాడుతూ చిలకలూరిపేట ప్రాంతంలోని నాగార్జునసాగర్ కాలువ చివరి భూములు కావడంతో తుర్లపాడు, పసుమర్రు మేజర్ కాలువల పొడిగించి ఈ ప్రాంత రైతాంగానికి సాగు, తాగునీరు ఇబ్బంది లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ ఇప్పటి వరకు అమలు కాలేదు. కొండవీడు కోటను అభివృద్ధి చేస్తామని చెప్పారు. చిలకలూరిపేట మండలం యడవల్లి వద్ద చాలా కాలం కిందట ఎస్సీ ఎస్టీలకు ఏకపట్టాగా 420 ఎకరాల భూములు సాగుకు ఇచ్చారు. వాటిని ప్రతి ఒక్కరికి పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని ఎన్నికల సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ భూముల్లో గ్రానైట్ నిక్షేపాలు ఉన్నాయని మంత్రి రజిని ద్వారా అక్కడి ఎస్సీ ఎస్టీ రైతులను మభ్యపెట్టి ఎకరా రు.8 లక్షలకు ఏపీఎంఐడీసీకి ఇచ్చేలా చేశారు. అనంతరం గుట్టుచప్పుడు కాకుండా వాటికి టెండర్లు పిలిచి వారి అనూయయులకు చెందేలా చేశారు.


మరమ్మతులకు నిధులు లేక నిరుపయోగంగా ఉన్న యడ్లపాడు మండలం బింతెనపాడు ఎత్తిపోతల పథకం

వార్డెన్లు..అప్పులపాలు

- అప్పుల ఊబిలో హాస్టళ్ల నిర్వాహకులు
- 8 నెలలుగా బిల్లులు చెల్లించని ప్రభుత్వం
- వసతి గృహాలకు రూ.20 కోట్లకుపైగా బకాయి
- బిల్లులు రాక.. అప్పులు చెల్లించలేక వార్డెన్లు సతమతం
- హాస్టళ్లకు సెలవులతో సంక్షేమాధికారులపై దుకాణదారుల ఒత్తిడి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎస్సీ వసతి గృహంలో 60 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఒక్కొక్కరికి నెలకు ప్రభుత్వం భోజన బిల్లు కింద రూ.1400 చెల్లించాలి. ఇలా నెలకు 84,000 చెల్లించాలి. ఎనిమిది నెలలుగా బిల్లుల చెల్లింపు నిలిచిపోయింది. అంటే ఆ వసతిగృహానికి రూ.6,72,000 బిల్లు చెల్లించాలి. ఆ వసతి గృహం నిర్వహకుడు ఈ మొత్తం అప్పు చేశారు. చిల్లర కొట్టులో కూడా బాకీ పేరుకు పోయింది.

ఇదీ ఉమ్మడి గుంటూరు జిల్లాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాల్లోని పరిస్థితి. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోయినా విద్యార్థుల ఆకలి చూడలేక వార్డెన్లు అప్పులతో సరుకులు కొనుగోలు చేసి హాస్టళ్లను ఎనిమిది నెలలుగా నిర్వహించారు. లక్షలకు లక్షలకు అప్పులు చేసి వసతి గృహాల నిర్వాహకులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఎప్పటికైనా బిల్లులు వస్తాయి దుకాణదారులకు చెల్లించవచ్చని వార్డెన్లు భావించారు. బటన్ నొక్కి లక్షల కోట్లు ప్రజలకు పంచిపెట్టానని చెబుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వసతిగృహాల బిల్లులకు మాత్రం బటన్ నొక్కలేదు. ఈ విద్యా సంవత్సరానికి మంగళవారం చివరి రోజు. దీంతో పాఠశాలలతో పాటు హాస్టళ్లకు కూడా సెలవులు. ఈ పరిస్థితుల్లో బిల్లుల మంజూరుపై వార్డెన్లలో ఆందోళన నెలకొంది. వసతి గృహాలకు సెలవులు ఇచ్చేలోపు తమ అప్పులు తీర్చాలని రుణదాతలు వార్డెన్లపై ఒత్తిడి చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలకు రూ.20 కోట్లకు పైగా బిల్లుల బకాయిలు పేరుకు పోయాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వసతి గృహాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఎనిమిది నెలలుగా వసతి గృహాల బిల్లులు ప్రభుత్వం విడుదల చేయలేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీలపై జగన్‌కు ఎంత ప్రేమ ఉందో వసతి గృహాల నిర్వహణ తెలియజేస్తోంది.

60 శాతం నిధులు ఏమైనట్లు?

వసతి గృహాల నిర్వహణ నిధుల్లో 60 శాతం కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో బిల్లులు చెల్లించలేని దుస్థితి ఏర్పడిందని సమాచారం. వసతి గృహాలను రాష్ట్ర ప్రభుత్వం మొక్కుబడిగా నిర్వహిస్తున్నదన్న విమర్శలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ తీరుతో వసతి గృహాల నిర్వాహకులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అప్పులకు వడ్డీలు పెరుగుతుండటంతో వార్డెన్లు ఆర్థిక వేతలు ఎదుర్కొంటున్నారు. కూరగాయలు, సరుకులు, గ్యాస్, పాలు అప్పులకు కొనుగోలు చేసి ప్రభుత్వం నుంచి బిల్లులు విడుదలైన సమయంలో వాటిని వసతి గృహాల అధికారులు దుకాణదారులకు చెల్లించే వారు. అయితే సెప్టెంబరు నుంచి ఎనిమిది నెలలుగా ఆ బిల్లులు విడుదల కాలేదు. దీంతో కొన్నిప్రాంతాల్లో వార్డెన్లుకు అప్పు దొరకని


నరసరావుపేటలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం

పరిస్థితులు కూడా నెలకొన్నాయి. అయినా అష్టకష్టాలు పడి వసతిగృహాలను నిర్వహించారు. పాఠశాల విద్యార్థికి నెలకు రూ.2,200 ఖర్చు అవుతుంటే ప్రభుత్వం రూ. 1,400 చెల్లిస్తోంది. కూరగాయలు, నూనె, గ్యాస్ అన్నింటి ధరలు భారీగా పెరిగిపోయాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం బడ్జెట్ పెంచకపోయినా ఎలాగోలా విద్యార్థులకు వార్డెన్లు ఆహారం అందించారు. అయినా వార్డెన్ల అవస్థలను పట్టించుకోని ప్రభుత్వం బిల్లుల మంజూరులో తాత్సారం చేస్తూ వస్తోంది. సెలవుల నేపథ్యంలో తమ బిల్లులు విడుదల చేయాలని వార్డెన్లు అభ్యర్థిస్తున్నారు.

డిజిటల్ భూమాయ!

- ఐదు ఎకరాల ప్రభుత్వ భూమికి టెండర్ పెట్టిన సచివాలయ ఉద్యోగి
- కుటుంబ సభ్యుల పేరుతో రికార్డులు నమోదు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 20: కంచె చేను మేసిందన్న చందంగా ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ఉద్యోగి గుట్టుచప్పుడు కాకుండా ప్రభుత్వ భూమిని మింగేశాడు. ప్రభుత్వానికి చెందిన భూమిని తన కుటుంబసభ్యులు, బంధువుల పేరిట హక్కుదారులుగా రికార్డులో నమోదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. పల్నాడు జిల్లా మాచవరం మండలం తురకపాలెం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ముప్పాళ్ల మండలానికి చెందిన తేలుకుట్ల గోపిరాజు తమ బంధువులలో ఒకరైన ముప్పా అచ్చమ్మ పేరిట రెండు ఎకరాలు, తేలుకుట్ల కొండలరావు, తేలుకుట్ల మహంకాళరావుల పేరుతో రెండున్నర ఎకరాలు చొప్పున గత ఏడాది ఆన్‌లైన్‌లో నమోదు చేయించాడు. ఆ తరువాత పిడుగురాళ్ల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గత ఏడాది అక్టోబరు నెలలో ముప్పాళ్ల మండలం చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన గోపిరాజు తనకు ముఖ్యులైన తేలుకుట్ల శ్రీనుదీక్ష అనే ఐదేళ్ల మైనర్ బాలిక పేరుతో అదే గ్రామానికి చెందిన ముప్పా అచ్చమ్మతో సెటిల్‌మెంట్ రిజిస్ట్రేషన్ చేయించాడు. కొన్నాళ్లకు సొసైటీ రుణం కోసం దరఖాస్తు చేయగా సొసైటీ అధికారులు సర్వే నెంబరు 819ని గుర్తించి ఆ నెంబరు మొత్తం సొసైటీ భూములుగా వుండగా రుణాలు ఇవ్వడం కుదరదని దరఖాస్తును తిరస్కరించడంతో విషయం బహిర్గతమైంది. అంతేకాకుండా సచివాలయ ఉద్యోగిగా వున్న ఆ వ్యక్తి ఆ గ్రామానికి, మండలానికి చెందినవారు కాకుండా బయట వారికి ఇక్కడ భూములు ఎలా కట్టబెట్టారనే విషయంపై మాచవరం మండలంలో తీవ్ర చర్చ నడుస్తోంది. సొసైటీ భూములు అదే రెవెన్యూ గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ మరికొన్ని సామాజిక వర్గాలకే వర్తిస్తుందని వేమవరం గ్రామానికి సంబంధీకు లైన వ్యక్తులు కాకపోయినా ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేయించుకున్నారనేదాని వెనుక ఎవరు వున్నారనేది తెలియాల్సి వుంది. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన సచివాలయ ఉద్యోగి అడిగే వారెవరూ లేరని ఖాళీగా వున్న భూములను అయిన వారి పేరిట గుట్టుగా మార్చేసుకోవడం పై సొసైటీ సభ్యులు మండిపడుతున్నారు. ఆ ఉద్యోగి ప్రస్తుతం బదిలీపై నరసరావుపేట మండలం లింగంగుంట్ల సచివాలయంలో పని చేస్తున్నాడు.


ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్న భూమి


బంధువుల పేరుతో 1-బి అడంగల్

ఒక్క ఇటుకైనా పెట్టలేదు

- కాపు కమ్యూనిటీ భవనంపై నిర్లక్ష్యం
- స్థలం కేటాయించి.. టీడీపీ హయాంలో శంకుస్థాపన

దాచేపల్లి, ఏప్రిల్ 20: స్థలం మంజూరైంది. రూ.కోటి నిధులు కేటాయించారు. శంకుస్థాపన జరిగింది. అయినా దాచేపల్లిలో కాపుల కల ఐదేళ్లుగా నెరవేరలేదు. టీడీపీ హయాంలో మంజూరైన కాపు కమ్యూనిటీ భవనంపై వైసీపీ పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చూపారు. భవనానికి ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. ఎన్నికలకు ముందు దాచేపల్లి కాపు సామాజికవర్గానికి మేలు చేకూరుస్తామని, అన్నివిధాల ఆదుకుంటానని కాసు మహేష్‌రెడ్డి ప్రచారం చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఆయన మాటలు నీటిమూటలుగానే మిగిలాయనేందుకు దాచేపల్లిలో కాపు కమ్యూనిటీ భవనం నిర్మాణమే నిదర్శనమని ఆ సామాజికవర్గానికి చెందిన వారు అంటున్నారు. గురజాల నియోజకవర్గంలో అత్యధికంగా దాచేపల్లిలో కాపు సామాజికవర్గం ఉంది. కాపులకు శుభకార్యాలు చేసుకునేందుకు కమ్యూనిటీ భవనం నిర్మించాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. ఈ క్రమంలో కాపులకు కమ్యూనిటీ భవనం ఏర్పాటుకు టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రత్యేకంగా కృషి చేశారు. ఆయన కృషి ఫలితంగా దాచేపల్లిలో స్థలం మంజూరైంది. ప్రభుత్వం కోటి రూపాయలను మంజూరు చేసింది. దీంతో 2019 ఫిబ్రవరి 10న కమ్యూనిటీ భవన నిర్మాణానికి యరపతినేని శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కమ్యూనిటీ హాలు పనులు నిలిచిపోయాయి. యరపతినేనిచే ప్రారంభించబడిన శిలాఫలకం ఎరువు దిబ్బల పాలైంది. కమ్యూనిటీ భవనానికి కేటాయించిన స్థలం పార్కింగ్ స్థలంగా మారింది.


వాహనాలకు పార్కింగ్ ప్రదేశంగా మారిన కాపు కమ్యూనిటీ స్థలం

కాపులంటే నిర్లక్ష్యం

వైసీపీ నేతలకు కాపులన్నా, కాపు కమ్యూనిటీ భవనాలన్నా నిర్లక్ష్యం. కాపులపై చూపుతున్న నిరాదరణకు రానున్న ఎన్నికల్లో వైసీపీ నాయకులు భారీ మూల్యాన్ని చెల్లించుకుంటారు. కాపులంతా ఏకమై రానున్న ఎన్నికల్లో సత్తాను చూపించాలి.


- అంబటి శేషగిరిరావు, మాజీ ఎంపీపీ

పెమ్మసానిని దూషించిన వ్యక్తిని
తక్షణమే అరెస్టు చేయాలి

● మేడికొండూరు పోలీసుస్టేషన్‌లో

కేసు నమోదు చేయాలని టీడీపీ నేతల డిమాండ్



పోలీసు స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

మేడికొండూరు ఏప్రిల్20: గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కఠినచర్యలు తీసుకోవాలని తెలుగుదేశం నాయకులు డిమాండ్ చేశారు. డాక్టర్ పెమ్మసానిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి మేడికొండూరు మండలం మంగళగిరిపాడు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించిన స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఏకమై శనివారం రాత్రి మేడికొండూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని కేసు నమోదు చేయాలని ఆందోళన చేశారు. దూషణకు పాల్పడి యువకుడు మంగళగిరిపాడుకు చెందిన వ్యక్తి కావున మేడికొండూరు పోలీసులు ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేయాలని వారు కోరారు. అయితే ఘటన జరిగింది గుంటూరు నగరంలో కనుక అక్కడి స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సీఐ దార్ల జయకుమార్ తెలుగుదేశం నాయకులకు సూచించారు. పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న వారిలో ఎక్కువశాతం మంది మంగళగిరిపాడుకు చెందిన ముస్లిం నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. వారితోపాటు గుంటూరు పార్లమెంట్ టీడీపీ మైనార్టీ అధ్యక్షులు అబ్దుల్ ఘని, మాజీ జడ్పీటీసీ గుంటుపల్లి సాంబశివరావు, మాజీ ఎంపీపీ మొక్కల సుబ్బారావు తదితరులు ఉన్నారు. కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎక్కువమంది పోలీస్ స్టేషన్ గుమికూడదని పోలీసులు తెలియజేయడంతో వాళ్లంతా గుంటూరులో ఫిర్యాదు చేసేందుకు వెళతామని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ సహేతుక విమర్శలు చేయవచ్చునని, దూషణకు పాల్పడడం సరైంది కాదని హితవు చెప్పారు. వైసీపీ నాయకులు వెనుక ఉండి ఇటువంటి వాఖ్యలు చేయిస్తున్నారని వారు ఆరోపించారు.

చంపుతానని పెమ్మసానికి బెదిరింపులు : యువకుడిపై కేసు

గుంటూరు, ఏప్రిల్ 20 : గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను చంపుతానని బెదిరించిన మేడికొండూరు మండలం తురకపాలెం గ్రామానికి చెందిన ఆలీ, మరికొందరు యువకులపై పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ లో కేసు నమోదయింది. శనివారం గుంటూరు పశ్చిమ వైసిపి అభ్యర్థి విడుదల రజిని నామినేషన్ దాఖలు సందర్భంగా జరిగిన ర్యాలీలో మేడికొండూరు మండలం తురకపాలెం గ్రామం నుంచి ఆలీతో పాటు అనేకమంది యువకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓ యూట్యూబ్ ఛానల్ తో ఆలీ మాట్లాడుతూ జగన్ మళ్ళీ సీఎం అవుతారని, ఆయన సీఎం కాగానే గుంటూరు టిడిపి పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌ను చంపేస్తానని హెచ్చరించాడు. ఇటీవల అతని ఎన్నికల ప్రచారంలో సద్దాం హుస్సేన్ పట్ల ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారని అందుకు నిరసనగా పెమ్మసానిని చంపేస్తానని తీవ్ర స్థాయిలో బెదిరించాడు. అంతేగాక టిడిపి అధినేత చంద్రబాబుతో పాటు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పైన ఆలీ అనుచితంగా వ్యాఖ్యలు చేశాడు. పవన్ కళ్యాణ్ ను కూడా చంపుతానని బెదిరించాడు. అయితే సద్దాం హుస్సేన్ పట్ల తాను చేసిన వ్యాఖ్యలపై డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వెంటనే క్షమాపణ చెప్పారు. అయినప్పటికీ కేవలం రాజకీయ దురుద్దేశంతో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను చంపాలని ప్రయత్నం జరుగుతున్నట్లు కోబాల్డ్‌పేటకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు పఠాన్ హజ్మతుల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు పలు సెక్షన్‌ల కింద ఆలీపై కేసు నమోదు చేశారు. న్యాయ సలహా అనంతరం పలు సెక్షన్లు చేర్చనున్నట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీలోకి వెయ్యి కుటుంబాలు చేరిక

● వైసీపీని వీడి భారీగా వలసలు..

● పసుపు కండువాలు కప్పి ఆహ్వానించిన యరపతినేని



టీడీపీలో చేరిన జానపాడు సర్పంచ్ మర్యాదరావుతో యరపతినేని

పిడుగురాళ్ల, ఏప్రిల్ 20: గురజాల నియోజకవర్గంలో టీడీపీలోకి భారీగా వలసల వరదలా జరుగుతున్నాయి. శనివారం పిడుగురాళ్ల, మాచవరం, దాచేపల్లి మండలాలకు చెందిన వారే కాకుండా గురజాల మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, ప్రస్తుత సర్పంచ్‌లు, సొసైటీ ఛైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ ఎంపిటిసిలు పిడుగురాళ్లలో గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావును కలిసి మద్దతు తెలిపారు. అనంతరం టీడీపీలో చేరిన వారందరికీ యరపతినేని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. జానపాడు సర్పంచ్ తాళ్లపోగు మర్యాదరావు, సొసైటీ ఛైర్మన్ వున్నం శ్రీను, మాజీ ఉపసర్పంచ్ తాళ్లపోగు గంగాధర్, యూత్ లీడర్లు జగదీష్, దిలీప్, ముసలయ్య, సాతులూరి పెద్దశ్రీనుతో పాటు మరో 120 కుటుంబాలకు పైగా టీడీపీలో చేరారు. అదేవిధంగా వీరాపురం గ్రామానికి చెందిన జనసేన సర్పంచ్ అభ్యర్థి కాశిక బుల్లయ్య, నీలంశెట్టి రాజా, పర్చూరి రవీంద్రబాబు, గుమ్మడి మురళీ, సైదులు, మరో 25 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. మాచవరం మండలంలోని రేగులగడ్డకు చెందిన ఎస్సీ బీసీ సామాజికవర్గాలకు చెందిన బత్తుల ఏసయ్య, ఉప్పాళ్ల నరసింహారావు, పప్పుల ప్రభాకర్, సింగడాల వెంకట్రామయ్యతో పాటు మరో 20 కుటుంబాల వారు టీడీపీలో చేరటం జరిగింది. గోవిందాపురంలోని వివిధ సామాజికవర్గాలకు చెందిన తలారి సైదయ్య, సోమరాజు వెంకటేశ్వర్లు, కాశయ్య, తాళ్లూరి నిత్యానందచారితో పాటు మరికొందరు టీడీపీలో చేరారు. పిడుగురాళ్ల పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు అలపర్తి నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ చల్లగుండ్ల సంతోషరావు, కందుకూరి దావీదు, పత్రా ఏసుదానం, గద్దల తిరుపతయ్య, పసుపులేటి విజయకుమార్, మందా స్వామి, రాజేష్‌తో పాటు మరో 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరటం జరిగింది. గురజాల మండలం జంగమహేశ్వరపురం, చర్లగుడిపాడు, గంగవరం, మాడుగుల, సమాధానం పేట, గురజాల పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన 250 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయా కార్యక్రమాలలో జడ్పీటీసీ జంగా వెంకటకోటయ్య, వున్నం నరసింహారావు, డాక్టర్ వున్నం నాగమల్లిఖార్జునరావు, వున్నం వెంకటరావు, వున్నం శ్రీను, పసుపులేటి నరసింహారావు, యర్నాన రామకృష్ణ, ముప్పాళ్ల సాంబయ్య, పాండురంగ శ్రీను, తురకా వీరస్వామి, సయ్యద్ అమీర్‌అలి, షేక్ బాబావలి, తదితరులు పాల్గొన్నారు.



కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో చేరిన వైసీపీ కౌన్సిలర్ శ్రీనివాసరావు

టీడీపీలోకి వైసీపీ కౌన్సిలర్

● పార్టీలోకి ఆహ్వానించిన కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి ఏప్రిల్ 20: పట్టణంలోని 19వ వార్డుకు చెందిన వైసీపీ కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు శనివారం సాయంత్రం టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనకు కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అయనతో పాటు మరికొంతమంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యెలినేడి రామస్వామి ఆతుకూరి నాగేశ్వరరావు, నూర్‌బాషా జానీబాబు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరవకట్టలో కార్డెన్ సెర్చ్

● 60 మోటారు సైకిళ్ళు.. మూడు ఆటోలు స్వాధీనం

● అదుపులో ముగ్గురు రౌడీషీటర్లు



తనిఖీ చేస్తున్న సీఐ కృష్ణారెడ్డి

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 20: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పట్టణంలోని వరవకట్టలో ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ నేతృత్వంలో శనివారం తెల్లవారు జామున 4:30 గంటల నుంచి ఉదయం 7:30 గంటల వరకు మొదటి పట్టణ పోలీసు స్టేషన్ పక్కన గల వరవకట్టకు నాలుగు మూలల పోలీసులు గుమ్మికూడి జల్లెడ పట్టారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 60 మోటారు సైకిళ్ళు, మూడు ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. షేక్ కాలేషా వలి ఎలియాస్ వరవకట్టబాబు, షేక్ సుభానీ, ఎలియాస్ బ్లాకీ, షేక్ సుభానీ అలియాస్ సమోసాలను అదుపులోకి తీసుకున్నట్టు మొదటి పట్టణ సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి తెలిపారు. తనిఖీల్లో రెండవ పట్టణ సీఐ భాస్కర్, రూరల్ సీఐ మల్లిఖార్జునరావు, ఎస్ఐలు మణికృష్ణ, సతీష్, అశోక్, రోశయ్య, బీఎస్ఎఫ్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

రాజధాని విచ్ఛిన్నకారులను ఓడించండి

● 1586వ రోజుకు ఆందోళనలు ..



వెంకటపాలెం శిబిరంలో మహిళల నిరసన

తుళ్ళూరు, ఏప్రిల్ 20: రాజధాని అమరావతి అభివృద్ధిని విస్మరించి, విచ్ఛిన్నానికి పాల్పడిన వైసీపీని ఓడించాలని 33 వేల ఎకరాల భూములు త్యాగంచేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు చేస్తున్న ఆందోళనలు శనివారం నాటికి 1586వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుండి వారు మాట్లాడుతూ.. రాష్ట్ర రాజధానిని నిర్వీర్యంచేసిన వారిని ఓడించటమే ధ్యేయంగా ప్రజలున్నారని రైతులు స్పష్టంచేశారు. జగన్‌రెడ్డి ఆడుతున్న డ్రామాలను ప్రజలు నమ్మవద్దని విన్నవించారు. అమరావతి నాశనం చేయటమే ఐదేళ్ల పాలనంతా సరిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు నిరసనలు కొనసాగాయి.





ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యేను సత్కరిస్తున్న వలంటీర్ దుర్గా, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి

ఎన్నికల ప్రచారంలో వలంటీరు

వినుకొండటౌన్, ఏప్రిల్ 20: పట్టణంలోని 14వ వార్డులో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో అంగన్‌వాడీ కార్యకర్త కొలకలూరి జ్యోతితోపాటు వలంటీర్ పందుల దుర్గ ఎమ్మెల్యేతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఇదే తరహాలో 14వ వార్డులో అంగన్‌వాడీ కార్యకర్తతోపాటు వలంటీర్ ప్రచారంలో పాల్గొని ఏకంగా బ్రహ్మనాయుడుకు శాలువాలతో సత్కరించిన దృశ్యాలను తెలుగుదేశంపార్టీ నాయకులు రిటర్నింగ్ అధికారి సుబ్బారావుకు చూపి ఫిర్యాదు చేశారు.

వల్లభాపురంలో మద్యం పట్టివేత



మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

కొల్లిపర, ఏప్రిల్ 20 : మండల పరిధిలోని వల్లభాపురంలో అక్రమంగా నిల్వవుంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెనాలి సెబ్ సీఐ వెంకటాచలం తెలిపారు. వల్లభాపురంకు చెందిన దొంతిరెడ్డి రామిరెడ్డి ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 80 బాటిల్స్ మద్యాన్ని శనివారం రాత్రి 9.30గంటల సమయంలో ఆకస్మిక దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈదాడుల్లో వల్లభాపురం చెందిన దొంతిరెడ్డి రామిరెడ్డి, అత్తలూరివారిపాలెంకు చెందిన దర్శి నాగరాజు, దర్శి రవితేజలను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కేసులో మరో నిందితుడు ప్రభుత్వం మద్యం షాపు సేల్స్‌మేన్ యడ్ల సునీల్‌ను అదుపులోకి తీసుకోవాల్సి ఉందని ఆయన తెలిపారు. వీరిపై కేసునమోదు చేసినట్లు సీఐ తెలియజేశారు. అదే విధంగా వల్లభాపురంలో కూసం కృష్ణారెడ్డి ఇంటి వద్ద 5లీటర్లు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కొల్లిపర ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు.

కమ్యూనిటీ స్థలాన్ని ఆక్రమించారు

● ఎమ్మెల్యే సుచరిత వద్ద వాపోయిన బూర్ల కాలనీ వాసులు

తాడికొండ, ఏప్రిల్ 20: తాడికొండలోని కొంత మంది వైసీపీ నాయకులు కమ్యూనిటీ స్థలాన్ని ఆక్రమించుకున్నారని ఆ పార్టీ ఎమ్మెల్యే మేకతోటి సుచరిత వద్ద వాపోయారు. శనివారం రాత్రి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత ఎన్నికల ప్రచారంకు తాడికొండలోని బూర్ల కాలనీకి వచ్చారు. ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థిస్తున్న క్రమంలో కాలనీలోని కొంతమంది మహిళలు తమ గోడును వెళ్లబోసుకున్నారు. 2005లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేసిందని అప్పటి నుంచి ఇక్కడే నివాసాలు ఏర్పాటు చేసుకొన జీవిస్తున్నామని పేర్కొన్నారు. కాలనీలో 16 సెంట్ల కమ్యూనిటి స్థలాన్ని కాలనీవాసులు అవసరాలకు వదిలి పెట్టారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామంలోని కొంతమంది వైసీపీ నాయకులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై కమ్యూనిటి స్థలానికి పట్టాలు పుట్టించుకున్నారని వాపోయారు. ప్రశ్నించే వారిపై దాడులకు దగుతూ కేసులు పెడుతూ కోర్టుల చుట్టు తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిటి స్థలాన్ని కాపాడి అభివృద్ధి చేయాలని కాలనీవాసులు వేడుకున్నారు. కమ్యూనిటీ స్థలంపై ఎమ్మెల్యేకు వివరిస్తున్న క్రమంలో మండల వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి కాలనీవాసులు చెప్పింది వాస్తమని చెప్పారు. సానుకూలంగా స్పందించిన సుచరిత అధికారంలోకి రాగానే కాలనీ వాసుల ఇష్టా ప్రకారం స్థలాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

కుడికాలువలో ఇద్దరు యువకుల గల్లంతు

● ప్రమాదం నుంచి బయటపడ్డ బాలిక

● జన్మదిన వేడుకలకు వచ్చి సరదాగా సెల్ఫీ దిగుతుండగా ఘటన

దుర్గి, ఏప్రిల్ 20: పుట్టినరోజు వేడుకలు జరుపుకొని సాయంత్రం సరదాగా నాగార్జున సాగర్ కుడి కాలువ వంతెనపై సెల్ఫీలు దిగుతూ జారిపడి ఇరువురు యువకులు గల్లంతైనఘటన అడిగొప్పుల వద్ద శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని అడిగొప్పుల గామంలో సచివాలయం - 2లో ఎంఎల్‌హెచ్‌పీగా విధులు నిర్వహిస్తున్న మస్తాన్‌బి కుమారుడు సొహెల్ (16), కుమార్తె అస్మద్‌తబస్సున్, వీరి స్నేహితుడు గుంటూరు నెహ్రూనగర్‌కు చెందిన ఎస్‌కే యూసఫ్ (16)లు శనివారం అడిగొప్పులకు చేరుకున్నారు. సొహెల్ పుట్టినరోజు సందర్భంగా మస్తాన్‌బి గృహంలో కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. సాయంత్రం వేళ కుటుంబసమేతంగా కుడి కాలువ వద్దకు చేరుకున్నారు. అక్కడ బ్రిడ్జిపై సెల్ఫీలు దిగుతూ ప్రమాద వశాత్తూ సొహెల్, యూసఫ్, అస్మద్‌తభుస్సున్‌లు కుడికాలువలో పడిపో యారు. గమనించిన తల్లి మస్తాన్‌బి స్థానికులతో కలిసి కుమార్తె అస్మద్‌తభుస్సున్‌ను నీటిని నుంచి బయటకు లాగి ఒడ్డుకు చేర్చారు. అప్పటికే సొహెల్, అతని స్నేహితుడు యూసఫ్‌లు నీటిప్రవాహంలో కొట్టుకుపోయి గల్లంతయ్యారు. సీఐ చిన మల్లయ్య అక్కడకు చేరుకొని గత ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. కాగా పుట్టిన రోజున తన కళ్లముందే కుమారుడు, అతని స్నేహితుడు గల్లంతు కావడంతో తల్లి మస్తాన్‌బి రోదన మిన్నంటింది.

అనిల్‌యాదవ్‌ను బలిపశువు చేసిన జగన్

● ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దుర్గి, ఏప్రిల్ 20: అనిల్‌కుమార్ యాదవ్‌ను జగన్‌మోహన్‌రెడ్డి బలిపశువును చేసి, గెలవలేని నరసరావుపేట సీటును కేటాయించారని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. శనివారం మండల కేంద్రమైన దుర్గి షాదీఖానాలో బీసీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన కుటుంబానికి అనేక పదవులిచ్చి ఆదుకున్నప్పటికీ బీసీలకు తాను ద్రోహం చేస్తున్నానని అనిల్‌కుమార్ యాదవ్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. 1994 నుంచి ప్రత్యక్షంగా రాజకీయాల్లో ఉన్నానని, తనకు పదవులు కొత్తేమీ కాదని, కాంగ్రెస్ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి రాజశేఖరరెడ్డి తనను పిలిచి మరీ గురజాల శాసనసభ అభ్యర్థిగా ప్రకటించారని చెప్పారు. 1985 నుంచి రెండు దఫాలుగా గురజాల శాసనసభ్యునిగా ఉన్నానని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి గురజాల శాసనసభ అభ్యర్థిగా ప్రకటిస్తూ పార్టీలో తనకు పెద్దపీట వేస్తానని హామీనిచ్చారని, ఎమ్మెల్సీ పదవి ఇస్తూ నియోజకర్గంలో తన మాట చెల్లకుండా చేశారని అన్నారు. సొంత కార్యకర్తలకు, నేతలకు అన్యాయం జరుగుతుంటే ఎన్నిమార్లు కాసు మహేష్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డిల దృష్టికి తాను తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదని అన్నారు. సొంత పార్టీ నేతలే తనను అవమానించారని అన్నారు. రెడ్డి కుటుంబాలు ఎన్ని పదవులైనా చేయొచ్చు గానీ బీసీ కుటుంబాల్లో అర్హత ఉన్న నేతలు ఏ పదవీ చేయకూడదా అని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం బీసీలపై పెట్టిన అక్రమ కేసులను టీడీపీ అధికారంలోకి రాగానే తొలగించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి సింగు నాగేశ్వరరావు, మున్నా రాంబాబు, గోళ్ల సురేష్, జనసేన జిల్లా కార్యదర్శి పులి హరి, మండల అధ్యక్షుడు తోటకూర శ్రీను, రుద్రాల రవి, బీజేపీ మండల అధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు, ఎలీషాబాబు, షేక్ అల్లాబాషా, మాబాషా, బీసీ నేతలు పాల్గొన్నారు.

వైసీపీ నేత నుంచి మద్యం బాటిళ్ల స్వాధీనం

నాదెండ్ల, ఏప్రిల్ 20 : మండలంలోని తూబాడు గ్రామానికి చెందిన వైసీపీ నేత కాసు చిన్నపరెడ్డి అనే వ్యక్తి నుంచి 160 మద్యం బాటిళ్ళను శుక్రవారం రాత్రి ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మోటారు బైక్ పై నాదెండ్ల నుంచి తూబాడు తీసుకు వెళ్తుండగా జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఎస్ఈబీ ఎస్ఐ బీ శశికుమార్ దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాసు చిన్నపరెడ్డిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

అమర్‌నాథ్ యాత్రికులకు
వైద్య పరీక్షలు

గుంటూరు (మెడికల్), ఏప్రిల్ 20: ఈ ఏడాది జిల్లా నుంచి అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో ప్రతి మంగళ, గురు వారాల్లో వైద్యపరీక్షలు నిర్వహించి మెడికల్ సర్టిఫికెట్లు జారీ చేస్తామని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుధీర్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రకు వెళ్లేందుకు 13 నుంచి 75 ఏళ్లలోపు వరకు మాత్రమే అర్హులని ఆయన తెలిపారు. వైద్యపరీక్షల కోసం వచ్చే యాత్రికులు తమ వెంట రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, అమర్‌నాథ్ యాత్ర మెడికల్ సర్టిఫికెట్ నమూనా, వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తీసుకొని రావాలని ఆయన సూచించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన కారు

● ఇద్దరు యువకులు దుర్మరణం .. ఒకరికి గాయాలు

గుంటూరు, ఏప్రిల్ 20 : స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్ద పలుకులూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. నల్లపాడు సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపలకలూరుకు చెందిన ఖలియులుద్దీన్, సిద్ధిక్, జానీబాషలు శుక్రవారం రాత్రి గుంటూరు వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. అదే సమయంలో గుంటూరు వైపు నుంచి పెదపలకలూరు వైపు వెళ్తున్న కారు జేఎల్ఈ సినిమాస్ ఎదురుగా ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఆ తర్వాత మరో ఆటోనూ ఢీ కొట్టింది. ఆటో పక్కనే ఉన్న డ్రైనేజీలో పడింది. ఈ ప్రమాదంలో ఖలిలుద్దీన్ ఘటనాస్థలంలోని మృతి చెందగా సిద్ధిక్, జానీబాషాలను జీజీహెచ్‌కు తరలించారు చికిత్సపొందుతూ సిద్ధిక్ కన్నుమూశాడు. జానీ బాష రెండు కాళ్లు విరిగాయి. జానీబాషా తండ్రి షేక్ సుభానీ ఫిర్యాదు మేరకు నల్లపాడు సీఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.97 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆గురజాల ◆సత్తెనపల్లి◆ పెదకూరపాడు



యరపతినేనికి స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

జంగమహేశ్వరపురంలో జనం జేజేలు..

● యరపతినేని, జంగాలకు అపూర్వ ఆదరణ

గురజాలటౌన్, ఏప్రిల్ 20: మునుపెన్నడూ లేని విధంగా మండలంలోని జంగమహేశ్వరపురంలో టీడీపీ జయజయధ్వానాలు మిన్నంటాయి. గ్రామంలో ప్రచారానికి వచ్చిన కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ జంగాలను గ్రామస్థులు జేజేలు పలుకుతూ స్వాగతించారు. ఓ వైపు పూల వర్షం.. మరో వైపు బాణాసంచాల పేళుల్లు, డీజే నృత్యాలు, యువత కేరింతలతో కూటమి నేతలకు సంబరాలు మిన్నంటాయి. మహిళలు 'మా స్వామివయ్యా..' అంటూ హారతులు పట్టారు. గ్రామంలో ప్రతి వీధినా ఇదే ఆదరణ పదేపదే ఎదురవడంతో కూటమి నేతల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వైసీపీకి కంచుకోటగా ఉన్న ఈ గ్రామంలో ఇంతటి ఆదరణ లభించడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. గ్రామానికి చెందిన 40 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి యరపతినేని, జంగా పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ యెనుముల పున్నారెడ్డి, మల్లారెడ్డి, అంజిరెడ్డి, వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, బ్రహ్మారెడ్డి, నరసింహారెడ్డి, ఆవుల వెంకటరెడ్డి, ఎం.అంజిరెడ్డి, వెంకటరెడ్డి, నారదాసు శ్రీను, సంకటి అంజిరెడ్డి, పోలు నాసరరెడ్డి, చాకలి దత్తు, గురువులు, నరసింహారెడ్డి, కాశంశెట్టి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



వివిధ గ్రామాల నాయకులతో సమాలోచనలు జరుపుతున్న భాష్యం ప్రవీణ్

నేతలందరూ ప్రచారకర్తలుగా మారాలి

● పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్

క్రోసూరు, ఏప్రిల్ 20: నియోజకవర్గంలోని టీడీపీ కూటమి నేతలందరూ ప్రచారకర్తలుగా మారాలని పెదకూరపాడు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. శనివారం ఆయన తాళ్ళచెరువు, పెదపాలెం, మిట్టపాలెం, కొండూరు, ఓర్వకల్లు గ్రామాలకు చెందిన కూటమి ముఖ్య నేతలతో సమాలో చనలు నిర్వహించారు. సూపర్ - 6 పథకాలను ఇంటింటికి ప్రచారం చేయాలన్నారు. మండలాల వారీగా గ్రామాల్లో ప్రచార కార్యక్రమం నిర్వహిస్తామని, ప్రతి రోజు అన్ని మండలాల్లో ప్రచారం ఉంటుందని ఆయన తెలిపారు. ఆయనతో పాటు సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబు, జనసేన జిల్లా నేతలు యర్రంశెట్టి రామకృష్ణ, బీజేపీ నాయకులు ఉన్నారు.



బెల్లంకొండ బీసీ యాదవ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న భాష్యం లావణ్య

భాష్యం ప్రవీణ్ సతీమణి ప్రచారం..

బెల్లంకొండ: ఒక్కసారి ఓటు వేసి ఆదరిస్తే పెదకూరపాడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామని నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సతీమణి భాష్యం లావణ్య తెలిపారు. శనివారం సాయంత్రం మండల కేంద్రమైన బెల్లంకొండలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, సర్పంచ్ జ్యోతి సముద్రం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పలు ఆలయాల్లో పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలను, ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యంప్రవీణ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నేతలు పలువురు పాల్గొన్నారు.

మండల కేంద్ర మైన బెల్లంకొండలో చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు వేడుకలను వైభవంగా నిర్వహించారు. భాష్యం ప్రవీణ్ కుమారుడు అఖిల్, ప్రవీణ్ భార్య లావణ్యలు హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, లక్ష్మీనారాయణ, గుంజా గంగారావు, హనుమంతరావు నాయక్, నాగమణి బాయి, ఓర్సు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



బీసీల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జంగా

అత్యంత దౌర్భాగ్యంగా జగన్‌రెడ్డి పాలన

● బీసీలను వాడుకునే వారు కాదు.. ఆదుకునేవారు కావాలి : ఎమ్మెల్సీ జంగా

దుర్గి, ఏప్రిల్ 20: రాష్ట్ర రాజకీయ చరిత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అత్యంత దౌర్భాగ్యంగా ఉందని, అవినీతి తప్ప అభివృద్ధి లేదని, బీసీలను రెచ్చగొట్టి వారి స్వార్థాలకు వాడుకోవడంలో జగన్‌రెడ్డి సిద్ధహస్తుడని గురజాల మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. శనివారం మండలంలోని శ్యామరాజపురం, అడిగొప్పుల, తేరాల, దుర్గి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం దుర్గిలో బీసీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీలకు పెద్దపీట వేసి వారిపి అన్నివిధాలా ఆదుకునేందుకు చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలను రూపొందించారన్నారు. బీసీ డిక్లరేషన్, 34 శాతం రిజర్వేషన్, ప్రత్యేక రక్షణ చట్టాలను తీసుకురానున్నట్లు తెలిపారు. బీసీలకు కార్పొరేషన్ల ద్వారా పదవులు కేటాయిస్తామన్నారు. కూటమి అభ్యర్థులైన బ్రహ్మారెడ్డి, శ్రీకృష్ణదేవరాయలుకు అండగా ఉండి వారిని గెలిపించాలని కోరారు. వైసీపీ నేతలు బీసీలను రెచ్చగొట్టి వారిని అనేక కేసుల్లో ఇరికిస్తున్నారని, ప్రతి ఒక్కరికీ ఓటు స్వేచ్ఛగా వినియోగించుకునే హక్కు ఉందని, అభివృద్ధి వైపు నిలవాలని జంగా అన్నారు.

బీసీ సమ్మేళనంలో ఎమ్మెల్సీ జంగా ..

కారంపూడి : నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ మైకుల్లో ఊకదంపుడు తప్ప జగన్ ప్రభుత్వం వారికి చేసిందేమీ లేదని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక గంగమ్మ దేవాలయ ఆవరణలో జరిగిన బీసీ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీలో బీసీలకు కనీస గౌరవం లేదని, అందుకే తాను బయటకు వచ్చానన్నారు. దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో గోళ్లసురేష్ యాదవ్, పంగులూరి అంజయ్య, లక్ష్మీనారాయణ, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు టీడీపీ అనుకూలమే..

● ఎన్డీయే ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలి

● మాదిగల ఆత్మీయ సమావేశంలో కూటమి అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, కన్నాలక్ష్మీనారాయణ



మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కన్నా, శ్రీకృష్ణదేవరాయలు

సత్తెనపల్లి, ఏప్రిల్ 20: ఎస్సీ వర్గీకరణకు టీడీపీ ఎప్పుడూ అనుకూలమేనని నరసరావుపేట పార్లమెంట్ కూటమి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, సత్తెనపల్లి అసెంబ్లీ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణలు అన్నారు. పట్టణంలోని టీడీపి ప్రజావేదికలో శనివారం మాజీ కౌన్సిలర్ బలిజేపల్లి సురేష్‌కుమార్ అధ్యక్షతన నియోజకవర్గ మాదిగల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముందుగా కన్నా మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే మాదిగలకు మేలు జరిగిందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వమూ వర్గీకరణకు అనుకూలంగా ఉందన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో మాదిగల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. సైకిల్‌గుర్తుపై ఓటువేసి తనను, కృష్ణదేవరాయలును గెలిపించాలని కోరారు. శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఎస్సీలకు సంబందించిన 27 సంక్షేమ పథకాలను రద్దుచేయటమే కాకుండా, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించిన సీఎం జగన్‌కు మాదిగలను ఓటు అడిగే హక్కు లేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే వైసీపీ రద్దుచేసిన పథకాలను తిరిగి ప్రారంభిస్తామన్నారు. పల్నాడు జిల్లాలో మాదిగలకు అండగా ఉంటామన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. సురేష్‌మాదిగ మాట్లాడుతూ ఎమ్మెల్యే అంబటి రాంబాబు మాదిగల వ్యతిరేకని, మాదిగ ఉద్యోగులను ఎన్నో ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. రానున్న ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు మాదిగలు సిద్ధంగా ఉన్నారన్నారు. మాదిగలంతా సైకిల్‌గుర్తుపై ఓటువేసి ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మానిక్యరావు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరును విదేశీ విద్య పథకం నుంచి తొలగించి తనపేరు పెట్టుకున్న వైఎస్ జగన్‌కు ఎస్సీలంతా బుద్ది చెప్పాలన్నారు. రూ.35 వేల కోట్ల ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిదులను ప్రభుత్వం నవరత్నాల పథకాలకు మళ్లించిన జగన్‌కు ఎస్సీలను ఓటు అడిగే హక్కు లేదన్నారు. ముందుగా డాక్టర్‌బీ ఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, జ్యోతిరావ్‌పూలే విగ్రహాలకు నేతలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సమావేశంలో యెలినేడి రామస్వామి, కనుమూరి బాజీ చౌదరి, కనుమూరి కోటేశ్వరరావు, బండారు నాగరాజు, అంకాళ్ళ ప్రభుదాసు, బొక్కా సంగీతరావు, పల్లె మార్కురాజు, గొర్రెపాటి సుశీల, యెలినేడి లక్ష్మీతులసి, కోటా జోషఫ్, దేపంగి మోషే, తొరటి రవి, తోట నర్సయ్య, రాచేటి జాకబ్, వర్లశ్రీను, ఎలీషా, జాన్సన్, కటకం రామకృష్ణ, వెంకయ్య, పురంచిన ఆదాం, కొరారు సంధ్య, అబ్రహాం, కాంతారావు, చిలకా చంటి, శ్యాం, గుజ్జర్లపూడి చంద్రకాంత్ పాల్గొన్నారు.

పల్నాడులో వైసీపీ అరాచకం

కారంపూడి, ఏప్రిల్ 20 : పల్నాడులో యాదవులపై వైసీపీ రౌడీలదౌర్జన్యం కొనసాగుతూనే ఉంది. మాచర్ల నియోజకవర్గం కారంపూడి మండలం మిర్యాల గ్రామానికి చెందిన తెలుగు యువత నాయకుడు బత్తుల శ్రీనివాసరావు యాదవ్‌కి సంబంధించిన వరిగడ్డి లోడ్ ట్రాక్టరును శనివారం రాత్రి తగలబెట్టారు. వైసీపీ రౌడీమూకలు మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి ఎన్నికల ప్రచార నిమిత్తం మిర్యాల గ్రామానికి రాగా బత్తుల శ్రీనివాసరావు యాదవ్ కార్యక్రమాన్ని ముందుండి నడిపించాడు. తెలుగుదేశానికి మద్దతుగా గ్రామంలో కృష్ణమూర్తి ప్రచారం నిర్వహించడంలో కీలక పాత్ర వహించారు. ఇది తట్టుకోలేని వైసీపీ రౌడీలు, శ్రీనివాసరావు యాదవ్ ట్రాక్టర్‌ను వరిగడ్డితో సహా తగలబెట్టారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అని మాట్లాడే జగన్ రెడ్డి నేను గొర్రెల కోసే వాడిని అని చెప్పుకునే అనిల్ కుమార్ యాదవ్, యాదవుల మీద జరుగుతున్న దౌర్జన్యాలకు ఏమి సమాధానం చెబుతారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి పల్నాడులో యాదవులపైన దాడులు, దౌర్జన్యాలు, హత్యలు పెరిగి పోయాయని స్థానిక టీడీపీ నేతలు ఆరోపించారు. ఇప్పటికైనా పల్నాడులో ఉన్న యాదవులందరూ ఇలాంటి వాటిని ఖండించకపోతే ముందు ముందు చాలా తీవ్ర ఇబ్బందులు పడుతామని హెచ్చరించారు.

విద్యుత్ అక్రమ వినియోగంపై ఫిర్యాదు

మాచర్ల రూరల్, ఏప్రిల్ 20: పట్టణంలోని ఎన్‌ఎస్పీ పీడబ్ల్యూడీ కాలనీలో విద్యుత్ అక్రమ వినియోగంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం మాజీ కౌన్సిలర్లు కొండూరు లెనిన్‌బాబు, సంతోష్ లతోపాటు కాలనీవాసులు ఎన్నికలరిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. పీడబ్ల్యూడీ కాలనీలో నిర్మిస్తున్న జగనన్న కాలనీ గృహాలకు, బోర్‌వెల్స్‌కు అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా జరుగుతున్న ఈ చర్యలపై స్పందించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బొల్లెద్దుల ప్రకాష్ ఉన్నారు.

అధినేతకు జన్మదిన శుభాకాంక్షలు

● వివిధ ప్రాంతాల్లో ఘనంగా చంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 20: పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు కేక్ కట్‌చేసి చంద్రబాబుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు జీవితం ప్రతిఒక్కరికి ఆదర్శప్రాయమని, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిస్థితికి చంద్రబాబు అవసరం ఎంతో వుందని యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. రానున్న ఎన్నికలలో రాష్ట్రంలో పూర్తి ఆధిక్యత పొంది చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వున్నం నాగమల్లికార్జున రావు, నరసింహారావు, బాబా వలి, అమీర్‌అలి, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కొమ్మినేని రామచంద్రరావు, తురకా వీరస్వామి, మల్లెల ఆదినారా యణ, చింతలపూడి రామ్మూర్తి, దియ్యా రామకృష్ణ, పిల్లి చెన్నారావు, పణితి రవి, మందా జాకబ్, డేవిడ్, బాబు, గూండాల ఆనంద్, వున్నం సురేష్, ఎల్‌వీఆర్, సాంబయ్య, వెంకటేశ్వర్లు, మేకల సాంబశివరావు, వల్లెపు రామకృష్ణ పాల్గొన్నారు.

మాచర్లటౌన్: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని శనివారం పట్టణంలో టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. చంద్రబాబునాయుడు నిండునూరేళ్ల ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యెనుముల కేశవరెడ్డి, నాగూర్ బాషా, దుర్గారావు, బండ్ల శ్రీను, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట: రాష్ట్ర పరిస్థితులు మారాలంటే టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సీఎం కావాలని పెదకూరపాడు నియోజక వర్గ టీడీపీ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. శనివారం పెదపాలెంలోని పాటిబండ్ల బాపిరాజు ఇంటి వద్ద నారా చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు నందిగం ఆశీర్వాదం, కిలారి రాజన్ బాబు, నల్లమేకల వెంకటేశ్వర్లు, గంధం కోటేశ్వరరావు, భద్ర, చందు తదితరులు పాల్గొన్నారు.



పిడుగురాళ్లలో కేక్ కట్‌చేస్తున్న గురజాల కూటమి అభ్యర్థి యరపతినేని

అమరావతి: ధరణికోట గ్రామంలో నిర్వహించిన చంద్రబాబు జన్మదిన వేడుకల్లో పెదకూరపాడు నియేజకవర్గ ఉమ్మడి కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌తో పాటు స్థానిక టీడీపీ నాయకుల పాల్గొని కేటక్ కట్ చేశారు. అనంతరము అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

సత్తెనపల్లి: టీడీపి జాతీయ అద్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను శనివారం సత్తెనపల్లి టీడీపీ ప్రజా వేదికలో నిర్వహించారు. ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ రాష్ట్ర అదికార ప్రతినిది పిల్లి మాణిక్యరావు, టీడీపీ నేతలు కేక్ కట్‌చేసి చంద్రబాబుకి జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు యెలినేడి రామస్వామి కటకం రామకృష్ణ, అంకాళ్ళ ప్రభుదాసు, యెలినేడి లక్ష్మీతులసి, నూర్‌బాషా జానీబాబు, బండారు నాగరాజు, ఆళ్ళ సాంబయ్య, కోమటినేని శ్రీనివాసరావు, కొరారు సంధ్య, కంబాల వెంకటేశ్వరరావు, జానీ ఖాజావలి, ఆతుకూరి నాగేశ్వరరావు, బుడే, కరిముల్లా, మస్తాన్‌వలి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పెదపాలెంలో కేక్ కట్ చేస్తున్న భాష్యం ప్రవీణ్



కేక్ కట్‌చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నేతలు



మాచర్లలో కేక్ కట్ చేస్తున్న బ్రహ్మారెడ్డి

అర్హులందరికీ ఇళ్లు కట్టిస్తాం..

● అజాద్‌నగర్ వాసులకు కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డి హామీ

మాచర్లటౌన్, ఏప్రిల్ 20: ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆజాద్‌నగర్‌లో ప్రాంతంలో అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే కాకుండా, మౌలిక సదుపాయాలను కల్పిస్తామని మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి హామీ నిచ్చారు. శనివారం పట్టణంలోని అజాద్‌నగర్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు వారి సమస్యలను బ్రహ్మారెడ్డి దృష్టికి తెచ్చారు. ఆజాద్‌నగర్‌లో ఎమ్మెల్యే పీఆర్కే ప్రోక్లెయిన్లతో 150 గృహాలు కూల్చివేసి, ఆయా స్థలాలను అర్హత లేని పిన్నెల్లి అనుచరులకు కట్టబెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ కాలనీ వాసులకు అండగా ఉంటానని, అధికారంలోకి రాగానేసమస్యలను పరిష్కరిస్తానని భరోసా నిచ్చారు .అనంతరం 8వవార్డులో ఎన్నికల ప్రచారం జరిపారు. కార్యక్రమంలో కొమెర దుర్గారావు, యెనుముల కేశవరెడ్డి, ఓర్సు క్రాంతికుమార్, నాగూర్‌బాషా, మైనా, బుజ్జి, సురేష్, గురవారెడ్డి, అంజిరెడ్డి, అనిల్, లాలావినోద్ తదితరులు పాల్గొన్నారు.

30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరిక..

వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడుకు చెందిన 30 వైసీపీ కుటుంబాలు శనివారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరాయి. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని తన నివాసంలో కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే ఉప్పలపాడుకు చెందిన మరో 16 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి సామినేని సిద్ధయ్య, టీడీపీ నేతలు మొద్దయ్య, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విజయపురిసౌత్: మాచర్ల మండలం లచ్చంబావితండాలో శుక్రవారం రాత్రి వైసీపీకి చెందిన 10 కుటుంబాలు టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్ సమక్షంలో టీడీపీలో చేరాయి. ధారునాయక్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవడం చారిత్రాత్మక అవసరమన్నారు. బ్రహ్మారెడ్డిని, లావు శ్రీకృష్ణదే వరాయలును గెలిపించుకోవాలన్నారు.

మాచర్లటౌన్: కాంగ్రెస్ పార్టీ నేత, మున్సిపల్ మాజీ చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాసరావు శనివారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే శ్రీలక్ష్మీ చెన్నకేశవ ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్, మాజీ కౌన్సిలర్లు మేకపోతుల యలమంద, గోపవరపు పూర్ణచంద్రరావు, కొత్తమాసు చెన్నకేశవరావు, జక్కుల కృష్ణయ్య, వీర్ల అంజనేయులు, నెహ్రూనగర్‌కు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

నియంతృత్వ పాలనకు చివరి రోజులు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్



పెదకూరపాడులో పర్యటిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి

పెదకూరపాడు, ఏప్రిల్ 20 : రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా సీఎం జగన్ రెడ్డి నియంతృత్వ పాలన సాగించారని, ఆయన పాలనలో అన్ని వర్గాల ప్రజు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, దుర్మార్గపు అరాచక పాలనకు ఇవే చివరి రోజులు అని, రాష్ట్ర ప్రజలంతా జగన్‌ను సాగనంపేందుకు కంకణ బద్దులయ్యారని టీడీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. పెదకూరపాడులో నూతనంగా ఏర్పాటు చేసిన టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ జగన్‌పాలనలో ప్రజలకు కష్టాలు తప్పా ఒరిగిందేమి లేదని, ఎన్నో ఆశలతో అధికార మిచ్చిన ప్రజలకు సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో విధ్వంసం, అరాచకమే సాగిందన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో తులతూగుతున్న రాష్ట్రాన్ని జగన్ సర్వనాశనం చేశాడని, జగన్ అహంకార మదాన్ని దించే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. పెదకూరపాడు నియోజక వర్గంలో కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌ను, ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలకు గెలిపించాలని కోరారు. ఆయన వెంట వెన్నా సాంబశివారెడ్డి, పఠాన్ నూర్జహాన్, అర్తిమళ్ళ రమేష్, అప్పారావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



రింగ్‌రోడ్‌లో మంత్రి రజని ఆఫీస్ ఎదుట బైకులతో రోడ్డు బ్లాక్ చేసిన వైసీపీ కార్యకర్తలు

ఆరు సార్లు.. అప్రతిహతంగా..



జవహర్‌లాల్ నెహ్రూతో కొత్త రఘురామయ్య



కొత్త రఘురామయ్య

- డబుల్ హ్యాట్రిక్ మహానేత కొత్త రఘురామయ్య
- కేంద్రంలో కీలక మంత్రి పదవులు
- వరుసగా ఆరు సార్లు ఎంపీగా విజయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఓటమి ఎరుగని మహానాయకుడు.. దాదాపు మూడు దశాబ్దాలపాటు పార్లమెంట్ సభ్యునిగా పనిచేశారు. లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా ఆరుసార్లు విజయకేతనం ఎగురవేసి డబుల్ హ్యాట్రిక్ సాధించారు. ఓటమి ఎరుగని ధీరుడు కొత్త రఘురామయ్య. కేంద్ర ప్రభుత్వంలో కీలక మంత్రి పదవులను అలంకరించారు. 1952 నుంచి 1979 వరకు లోక్ సభ సభ్యుడిగా ఉన్నారు. సంగం జాగర్లమూడి గ్రామంలో 1912, ఆగస్టు 6న ఆయన జన్మించారు. గుంటూరులోని ఆంధ్రా క్రిష్టియన్ కళాశాల, లక్నో విశ్వవిద్యాలయాల్లో విద్యనభ్యసించారు. అనంతరం రఘురామయ్య ఇంగ్లాండులోని మిడిల్ టెంపుల్ వెళ్ళి 'బార్-ఎట్-లా' చదివాడు. స్వదేశము తిరిగి వచ్చి 1937 నుంచి 1941 వరకు మద్రాసు హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. ఆ తదుపరి బ్రిటీష ప్రభుత్వంలో న్యాయశాఖలో కొంతకాలం ఉద్యోగం చేశారు. అనంతరం భారత ప్రభుత్వ న్యాయ శాఖలో డిప్యుటీ సెక్రటరీగా పనిచేశారు. 1951లో ప్రభుత్వ ఉద్యోగం వదలి జాతీయ కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయరంగంలోకి అడుగు పెట్టారు.

మూడు దశాబ్దాలుపాటు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలకపాత్ర వహించారు. తొలి లోక్‌సభకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తెనాలి నుంయి (1952-57) ఎన్నికయ్యారు. రెండవ లోక్ సభ (1957-62) ఎన్నికల్లో గుంటూరు లోక్ సభా స్థానం నుంచి గెలునొందారు. ఆ తదుపరి వరుసగా 3వ లోక్ సభ (1962-67), 4వ లోక్ సభ (1967-72), 5వలోక్ సభ (1972-77), 6వ లోక్‌సభ (1977-1980) లలో గుంటూరు నియోజకవర్గం నుంచి విజయం సాధించారు.

జవహర్ లాల్ నెహ్రూ మంత్రివర్గంలో 1957లో రక్షణ శాఖ సహాయ మంత్రిగా.. 1964 వరకు రక్షణ, కార్మిక, పౌర సరఫరాలు మంత్రిగా పనిచేశారు. లాల్ బహదుర్ శాస్త్రి మంత్రివర్గంలో(1964-66) వరకు పౌర సరఫరాలు, సాంకేతిక శాఖలకు కేంద్రమంత్రిగా సేవలందించి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇందిరాగాంధీ గారి మంత్రివర్గంలో(1966- 77) వరకు న్యాయ, పెట్రోలియం, పార్లమెంటరీ వ్యవహారాలు, నౌకా రవాణా, పర్యాటక శాఖామాత్యులుగా సుదీర్ఘకాలం పనిచేశారు. దేశంలో అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. రాష్ట్ర పజలకు విశేష సేవలు అందజేశారు.

1975లో ఆంధ్ర విశ్వవిద్యాలయం, 1977లో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం కొత్త రఘురామయ్యకు గౌరవ డాక్టరేట్ ఇచ్చి గౌరవించాయి. కళాప్రపూర్ణ పురస్కారాన్ని కూడా ఆంధ్ర విశ్వవిద్యాలయం అందించి ఆయనను సత్కరించింది. పార్లమెంట్ సభ్యుని పదవిలో ఉన్న సమయంలోనే 1979 జూన్ 6న రఘురామయ్య మరణించారు. కొత్త రఘురామయ్య పేరుతో నరసరావుపేట, దుగ్గిరాలలో రెండు కళాశాలలు ఏర్పాటు చేశారు.

డబ్బులిచ్చి.. తరలించారు

- మంత్రి రజిని నామినేషన్ ప్రక్రియలో భారీగా జనసమీకరణ
- డ్వాక్రా మహిళలకు నగదు, చీరలు
- రింగ్ రోడ్ వద్ద వైసీపీ కార్యకర్తలు బైక్‌లతో హల్‌చల్

గుంటూరు (కార్పొరేషన్), ఏప్రిల్ 20: రాష్ట్ర మంత్రి విడదల రజిని నామినేషన్ రోజున బలప్రదర్శన కోసం అడుగడుగునా ఎన్నికల నియమావళిని ఉల్లఘించా రు. వైసీపీ నాయకులు యథేచ్ఛగా డబ్బు, మద్యం పంపిణీ చేశారు. శనివారం ఆమె గుంటూరు పశ్చిమ వైసీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. రింగ్ రోడ్‌లోని ఐడీబీఐ బ్యాంక్ సెంటర్ నుంచి గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా జరిగింది. పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని ప్రతి డివిజన్ నుంచి ఆయా డివిజన్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పెద్దఎత్తున జన సమీకరణకు భారీగా డబ్బులు ఖర్చు పెట్టారు. అనేక ప్రాంతాల్లో టిఫిన్, భోజన సదుపాయాలు కల్పించారు.

నియోజకవర్గంలోని సీఎంఎంకు రూ.20 వేలు, చీర, కమ్యూనిటీ ఆర్గనైజర్స్(సీవో) ఏడుగురికి రూ.పదివేల రూపాయలు నగదు, చీర, రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పీ) సుమారు 100 మందికి 5 వేల రూపాయల చీర అందించినట్లు సమాచారం. దీంతో డ్వాక్రా మహిళలను పెద్దఎత్తున నామినేషన్ ప్రక్రియకు తరలించారు. ప్రతి ఒక్కరికి నగదు, ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనాన్ని పెట్టి మరి ఆటోలో తీసుకొచ్చి తిరిగి అదే ఆటోలో ఇంటి వద్ద వదిలిపెట్టే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో సీఎంఎం, సీవోలు, ఆర్పీలు డబ్బులు తీసుకొని పెద్దఎత్తున డ్వాక్రా మహిళలను తరలించారు.

మంత్రి రజిని నామినేషన్ ప్రక్రియలో డబ్బులు, మద్యం ఏరులై పారాయి. మగాళ్లకు ప్రతి ఒక్కరికి క్వార్టర్ బాటిల్ పంపిణీ చేశారు. మందుతోపాటు రూ.500 అందజేశారు. మహిళలకు రూ.500, చీరను పంపిణీ చేశారు. ఈ ప్రక్రియ అంతా కళ్లెదుట జరుగుతున్నా ఎన్నికల పరిశీలకులు, మైక్రో అబ్జర్వర్లకు, ఇతర ఎన్నికల అధికారులకు ఎక్కడా కనపడలేదు.

రింగ్ రోడ్‌లో అరాచకం...

రింగ్ రోడ్‌లో మంత్రి రజిని ఆఫీస్ వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలు అరాచకం సృష్టించారు. ఐడీబీఐ బ్యాంక్ ఎదుట రోడ్డును బైకులతో బ్లాక్ చేసి వాహన దారులకు తీవ్ర ఇబ్బంది కలిగించారు. దీంతో ఆ దారిలో వెళ్లేవారు ట్రాఫిక్‌లో ఇరుక్కొని ఇబ్బందులు పడ్డారు. మంత్రి రజిని కార్యాలయం ఎదుట సుమారు గంటకు పైగా బైకులను అడ్డుగా పెట్టి ట్రాఫిక్‌ను నిలిపివేశారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

చివరి నిమిషంలో ఛాన్స్ మిస్



మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 20: ఎన్నికల వేళ రాజకీయ పార్టీల కూడికలు,తీసివేతలకు తెంపేవుండదు. ఈ లెక్కల్లో రాత్రికి రాత్రి ఎంపీ, ఎమ్మెల్యే లు అయిన వాళ్ల ఉన్నారు.. రాత్రి కి రాత్రి కి ఛాన్స్ మిస్ అయిన వాళ్ల వున్నారు.1999 ఎన్నికల్లో గురజాల నియోజకవర్గంలో అటువంటి ఆసక్తి కర సన్నివేశం జరిగింది. అంతా ఓకే అయ్యింది బి-ఫామ్ తీసుకోవటానికి రమ్మని మాజీ ఎమ్మెల్సీ టిజివి కృష్ణరెడ్డి కి హైదరాబాద్ గాంధీ భవన్ నుండి ఫోన్ వచ్చింది. పట్టలేని సంతోషం తో ఆయన గురజాల నుండి హైదరాబాద్ వెళ్లే సరికి సీన్ మారిపోయింది. నరసరావుపేట పార్లమెంటు పరిధిలో బీసీలకు ఒక్క సీటు ఐయినా ఇస్తే బాగుంటుందన్న వాదన తెర పైకి రావటంతో టిజివికి ఛాన్స్ మిస్ అయ్యింది. ఆ సీట్‌ను ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి కేటాయించడంతో ఎగువ సభలో ప్రవేశించేందుకు టిజివి కృష్ణా రెడ్డి దశాబ్ద కాలం వేచి చూడాల్సి వచ్చింది.

వృద్ధులు.. దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు





(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)


వృద్ధులు.. దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతం వైకల్యం ఉన్న దివ్యాంగులు హోం ఓటింగ్ వినియోగించుకోవచ్చు. ఇందుకు ఎన్నికల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటు హక్కును పొందేందుకు రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఫారం-12డి దరఖాస్తు చేసుకుంటే ఎన్నికల కమిషన్ నిర్దేశించిన తేదీల్లో వారి ఇంటి వద్దకే వెళ్లి ఓటు వేయించుకోనున్నారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు జారీ చేయడంతో తదనుగుణంగా చర్యలు చేపట్టారు. ఉద్యోగులు ఏ విధంగా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకుంటారో అదే విధంగా వృద్ధులు, దివ్యాంగులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తులను అందుబాటులో ఉంచారు. ఆ దరఖాస్తు తోపాటు ఓటరు కార్డు నకలు కూడా జత చేసి సమర్పించాలి. నియోజకవర్గ పరిధిలోని ఆర్వోల వద్ద దరఖాస్తు చేసుకుంటే వచ్చేనెల 5వ తేదీ నుంచి 9వ తేదీలోపు వారి ఇంటి వద్దకే వచ్చి ఓటు హక్కును వినియోగించుకొనే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఆర్వో కార్యాలయాల్లో దరఖాస్తులు కూడా స్వీకరిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి జరిగే ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని వృద్ధులు, దివ్యాంగుల కోసం ఈ అవకాశాన్ని కల్పించింది.

ఎన్డీయే కూటమితోనే అభివృద్ధి సాధ్యం

- రెంటపాళ్ళలో కన్నా, లావు ముమ్మర ప్రచారం



రెంటపాళ్ళలో ప్రచారం నిర్వహిస్తున్న లావు శ్రీ కృష్ణదేవరాయలు, కన్నా లక్ష్మీనారాయణ





ప్రచారంలో పాల్గొన్న కార్యకర్తలు, అభిమానులు

సత్తెనపల్లి, ఏప్రిల్ 20: మండలంలోని రెంటపాళ్ళలో శనివారం సాయంత్రం సత్తెనపల్లి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, నరసరావుపేట పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో పథకాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. అమరావతి రాజధానిగా కొనసాగాలన్నా, రాష్ట్రం అభివృద్ధి జరగాలన్నా ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. వైసీపీ పాలనలో ప్రజలకు తీరని ద్రోహం జరిగిందన్నారు. లావు శ్రీ కృష్ణదేవరాయలు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్ పాలనకు స్వస్తిపలికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకుందామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటం ద్వారా రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. తెలుగుదేశం ప్రవేశపెట్టిన పథకాలు అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి పార్లమెంట్ సభ్యునిగా తనను, అసెంబ్లీ అభ్యర్థిగా కన్నా లక్ష్మీనారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రచారంలో భాగంగా గ్రామానికి వచ్చిన శ్రీ కృష్ణ దేవరాయలకు, కన్నా లక్ష్మీనారాయణకు జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణ సంచా కాలుస్తూ తప్పెట్లతో ఘన స్వాగతం పలికారు. మహిళలు కోలాట ప్రదర్శన నిర్వహించారు. స్థానిక దేవాలయాల్లో కన్నా, లావు పూజలు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, నాయకులు మక్కపాటి రామచంద్రరరావు, రామకృష్ణ, చెన్నమల్లు శ్రీహరి, మోహన్‌బాబు, కట్టికోట శ్రీనివాసరావు, ఎం.రామాంజనేయులు, ఎం.భాస్కర్, రామ సైదులు, ధనేకుల సాంబశివరావు, ఏకుల రాజశేఖర్, కొమెరె సాంబశివరావు, కొమ్మిశెట్టి సాంబశివరావు, రెంటపాళ్ళ గ్రామానికి చెందిన జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో లావు శ్రీ కృష్ణ దేవరాయలు ప్రచారం

సత్తెనపల్లి, ఏప్రిల్ 20: నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలు మండలంలోని దీపాలదిన్నెపాలెం, కట్టమూరు, గోరంట్ల, బుజ్జర్లపూడి, భట్లూరు గ్రామాల్లో స్థానిక పార్టీ నేతలు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీని ఓడిద్దామని, అమరావతిని నిర్మిద్దామని ఆయన ప్రజలకు పిలుపు నిచ్చారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, అమరావతి రాజధానిగా కొనసాగుతుందన్నారు. గోదావరి - పెన్నా నదుల అనుసంధానం జరుగుతుందన్నారు. అమరావతి రాధాని పై ప్రభుత్వం ఇప్పటి వరకు చేసిన తప్పుడు ప్రచారాలను ప్రజలు తిప్పి కొట్టారన్నారు. మూడు రాజధానులను ఏర్పాటు చేస్తామని చెప్పిన జగన్ ఒక్క రాజధాని కూడా నిర్మించ లేదన్నారు. అమరావతి రాజధానిగా కొనసాగాలన్నా, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభించాలన్నా రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తు పై ఓటు వేసి తనను, కన్నా లక్ష్మీనారాయణను గెలిపించాలని కృష్ణ దేవరాయలు పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రజలు విజ్ఞతతో వ్యవహరించి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు ద్వారా ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభించిన్న ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన ప్రచారంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, పాటిబండ్ల పూర్ణచంద్రరరావు, లక్ష్మీనారాయణ, శ్రీను, మండడి అప్పారావు, కాళి ప్రసాదు, మండడపు శ్రీనివాసరావు, చక్రధర్, ఈదర రామారావు, పోపూరి శేష వెంకట కుమారి, పుట్టా చలమయ్య, గంగూరి అమరేశ్వరరావు, ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఉందా.. లేదా?

- డీఆర్వోకు ఏపీజేఏసీ నాయకుల వినతి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 20: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఉందా.. లేదా అని ఏపీజేఏసీ ఛైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు ప్రశ్నించారు. పోస్టల్ బ్యాలెట్ గడువు సమీపిస్తున్నా ఇంతవరకు జిల్లాలో ప్రక్రియ ప్రారంభం కాలేదన్నారు. పోస్టల్ బ్యాలెట్‌పై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని కోరుతూ శనివారం కలెక్టరేట్‌లో డీఆర్వో పెద్ది రోజాకు ఏపీజేఏసీ ఉద్యోగుల సంఘ నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఘంటశాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ వినియోగం నూరు శాతం జరిగేలా ఎన్నికల సంఘం దిశా నిర్దేశం చేసినా జిల్లాలో ఆ పరిస్థితి కనబడటం లేదని తెలిపారు. 12 డీ ఫామ్‌లను ఎక్కడ సమర్పించాలనే విషయమై ఉద్యోగుల్లో అయోమయం నెలకొందన్నారు. ఫామ్‌లను తహసీల్దార్లకు ఇవ్వాలని, కొందరు, ఓటు ఉన్న చోటే తహసీల్దార్లకు ఇవ్వాలని మరి కొందరు, నియోజకవర్గ హెడ్‌క్వార్టర్ తహసీల్దారుకు ఇవ్వాలని ఆర్‌వోలు చెబుతూ ఉద్యోగుల్లో గందరగోళం సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సిబ్బంది నిర్వాకంతో ఉద్యోగుల ఓట్లు ప్రమాదంలో పడ్డాయన్నారు. పోలింగ్ రోజున ఫామ్ 12తో నేరుగా బూత్‌కు వెళ్లి ఓటు వినియోగించే అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ కన్వీనర్ శెట్టిపల్లి సతీష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్, ఉపాధ్యాయ సంఘ నాయకులు బసవ లింగారావు, వేళనని రాజు, కళాధర్, పెదబాబు, అంజనేయులు, జానీబాషా, శ్యామ్‌సుందర్, శ్రీనివాస్, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

26 వరకు పోస్టల్ బ్యాలెట్ పొడిగింపు

పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12 డీలపై ఓపీవోలు, ఇతర సిబ్బందిలో గందరగోళం నెలకొన్నది. ఒకపక్క గడువు సమీపిస్తుండటం, మరోవైపు అస్పష్టత తొలగకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఎట్టకేలకు ఎన్నికల సంఘం నుంచి పోస్టల్ బ్యాలెట్‌పై విధి విధానాలను జారీ చేసింది. ఫారం-12డీల స్వీకారానికి గడువు తేదీని ఈ నెల 22 నుంచి 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు పొడిగించింది. ఉద్యోగి ఎక్కడైతే పని చేస్తున్నాడో తన ఓటు వేరే నియోజకవర్గం/జిల్లాలో ఉన్నా ఫారం-12డీని మాత్రం పని ప్రదేశంలోని నియోజకవర్గ కేంద్రంలో ఉండే ఏఆర్‌వోకే ఇవ్వాలిని తెల్పింది. ఏఆర్‌వోలు తమ వద్దకు వచ్చిన ఫారం-12 డీలను ఏ రోజుకు ఆ రోజు ఆర్‌వోలకు పంపాలి.

అంబటి మురళిపై మరో కేసు నమోదు

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 20:: పొన్నూరు వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణపై తాజాగా మరో కేసు నమోదైంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు వైసీపీ పై నాలుగు కేసులు నమోదైన్నట్లు సమాచారం. శనివారం అంబటి మురళీకృష్ణపై మరో కేసు నమోదు చేశారు. ఈ నెల 13వ తేదీన వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిపై రాయి దాడి జరిగిన తర్వాత అనుమతులు లేకుండా పట్టణంలోని ఐల్యాండ్ సెంటర్‌లో కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించటమే కాకుండా ప్రతిపక్ష టీడీపీపై అసత్య ఆరోపణలు చేయటంపై ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా మురళీకృష్ణపై కేసు నమోదు చేశారు. మురళీపై వరుస కేసులు నమోదవటం పట్ల సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఉద్యోగి సస్పెన్షన్

పొన్నూరుటౌన్, ఏప్రిల్20: ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాచవరం గ్రామంలోని దేవాదాయ శాఖ నైట్ వాచ్‌మెన్ ఉమ్మడి వినోద్ కుమార్‌ను సస్పెండ్ చేసిన్నట్లు రిటర్నింగ్ ఆఫీసర్ ఎ.లక్ష్మీ కుమారి శనివారం తెలిపారు. ఈ నెల 13వ తేదిన వైసీపీ నిర్వహించిన సిద్ధం సభలో పాల్గొనటం, మా నమ్మకం నువ్వే జగన్ బోర్డు ఏర్పాటు చేయటంతో ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించినందుకు ఉద్యోగం నుంచి తొలిగించిన్నట్లు ఆర్వో తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్‌లకు హెల్ప్ డెస్క్‌లు

నరసరావుపేట, ఏప్రిల్ 20: నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గం, 7 అసెంబ్లీ నియోజక వర్గాలకు పోస్టల్ బ్యాలెట్ నిర్వహణకు హెల్ప్‌డెస్క్‌లను ఆయా నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి శివ శంకర్ లోతేటి శనివారం తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వసతిని ఎన్నికల విధుల్లో ఉన్న ముఖ్యమైన శాఖల ప్రభుత్వ సిబ్బంది ఆయా నియోజక వర్గాలలోని సిబ్బందిని సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అయన కోరారు.

నియోజకవర్గం	సంప్రదించాల్సి అధికారి	మొబైల్ నెంబరు
నరసరావుపేట లోక్‌సభస్థానం	సామ్రాజ్యం, శ్రావయ్య	6281073020 9490309630
నరసరావుపేట అసెంబ్లీ	వి.శ్రీనివాసరావు ఏవో	9985744342
పెదకూరపాడు	నమూతులయ్య	6300909696
చిలకలూరిపేట	వరప్రసాద్ తహసీల్దార్	9949096532
సత్తెనపల్లి	లక్ష్మీ నరసింహా తహసీల్దార్	9949098622
వినుకొండ	నాగరాజు డీటీ	6300823885
గురజాల	రామాంజనేయులు	8247055270
మాచర్ల	కె.చంద్రశేఖర్ తహసీల్దార్	7032929348

జిల్లాలో 13 నామినేషన్‌లు దాఖలు

నరసరావుపేట, ఏప్రిల్ 20: జిల్లాలో శనివారం మొత్తం 13 నామినేషన్లు దాఖలయ్యాయి. నరసరావుపేట లోక్‌సభకు ఒకటి, అసెంబ్లీకి 12 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు ప్రకటించారు. ఇప్పటి వరకు జిల్లాలో 44 నామినేషన్‌లు దాఖలయ్యాయి. కాగా శనివారం నరసరావుపేట లోక్‌సభకు జాతీయ జనసేన పార్టీ అభ్యర్థిగా గోదా రమేష్ నామినేషన్ దాఖలు చేశారు. నరసరావుపేట అసెంబ్లీ స్థానానికి బీఎస్‌పీ అభ్యర్థిగా బూదాల బాబురావు, స్వతంత్ర అభ్యర్థిగా షేక్ మహబూబ్ మంజూర్ నామినేషన్ దాఖలు చేశారు. గురజాలకు కొయా రామారావు (స్వతంత్ర), మాచర్లకు యర్రమాల రామచంద్రారెడ్డి (కాంగ్రెస్), యర్రమాల కృష్ణవేణి (కాంగ్రెస్), డీ సైదారాజు (స్వతంత్ర), పెదకూరపాడుకు నంబూరు వసంతకుమారి (వైసీపీ), పమిడి నాగేశ్వరరావు (కాంగ్రెస్), గౌతుకట్ల అంకమ్మరావు (స్వతంత్ర), నంబూరు కళ్యాణచక్రవర్తి (స్వతంత్ర), సత్తెనపల్లికి జొన్నలగడ్డ విజయ్‌కుమార్ (భైబీమ్‌రావ్ భారత్ పార్టీ) నామినేషన్ దాఖలు చేశారు.

నమ్మించి నట్టేట ముంచిన గోపిరెడ్డిని గద్దె దించాలి

● డాక్టర్ అరవింద బాబు

రొంపిచర్ల, ఏప్రిల్ 20: నమ్మించి నట్టేట ముంచిన అరవిందబాబును గద్దె దించాలని కూటమి టీడీపీ అభ్యర్థి చదలవాడ అరవిందబాబు శుక్రవారం రాత్రి పేర్కొన్నారు. మండలంలోని పరగటిచర్ల, నలగార్లపాడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అరాచకాలకు ప్రజలు బలైపోయారని తెలిపారు. . నియోజక వర్గంలో అన్యాయం మితి మీరి పోయిందని తెలిపారు. కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



నలగార్లపాడులో ప్రచారం చేస్తున్న అరవిందబాబు

డాక్టర్ చదలవాడ, లావును గెలిపించాలని ఇంటింటి ప్రచారం

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 20: నరసరావుపేటలో నియోజవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలింపించాలని కుటుంబ సభ్యులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు కుమార్తె డాక్టర్ చదలవాడ అమూల్య, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు సతీమణి డాక్టర్ లావు మేఘన శనివారం 31వ వార్డులో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలు మన భవితకు మార్గదర్శకాలుగా నిలబబో తున్నాయని డాక్టర చదలవాడ అమూల్య, డాక్టర్ లావు మేఘన వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొల్లా అవినీతి సొమ్మును కక్కిస్తేనే వినుకొండ అభివృద్ధి: జీవీ

ఈపూరు, ఏప్రిల్ 20: బొల్లా బ్రహ్మనాయుడు అవినీతి సొమ్మును కక్కిస్తే నే వినుకొండ నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయవచ్చునని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని శ్రీనగర్, అంగలూరు, గుండేపల్లి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునతో కలిసి శనివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సత్యనారాయణపురంనకు చెందిన 15 కుటుం బాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి జీవీ, మక్కెన కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

● వినుకొండటౌన్, ఏప్రిల్ 20: బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల చెంచుగూడెం గ్రామానికి చెందిన చెంచు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నందికొండ శ్రీను వైసీపీని వీడి తెలుగుదేశంపార్టీలో చేరారు. బొల్లాపల్లి మండలం గరికపాడుకు చెందిన వైసీపీ నుంచి గ్రామ ఉపసర్పంచ్ ప్రభుదాస్‌తోపాటు 30 కుటుంబాలు వారు టీడీపీలో చేరారు. పట్టణంలోని సంజీవ్‌గాంధీనగర్‌కు చెందిన ఇట్లాపురం బాజి, షేక్ బాజి, పతకమూరి జాఫర్‌లతోపాటు పలు కుటుంబాలు జీవీ ఆంజనేయులు సమక్షంలో టీడీపీలో చేరారు. ఇదిలా ఉండగా పట్టణంలోని పలు వార్డుల్లో జీవీ ఆంజనేయులు కుటుంబసభ్యులు గోనుగుంట్ల హరిష్, ఆయన సతీమణి లీలావతి వార్డుల్లో కార్యకర్తలతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

కార్పెంటర్లతో మాజీ మంత్రి ప్రత్తిపాటి సమావేశం

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 20: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా కార్పెంటర్లకు మంచి రోజులు కల్పిస్తామని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్పెంటర్ల అసోసియేషన్ సమావేశం జరిగింది.

కూటమికి కాపు, బలిజ సంక్షేమ సేన మద్దతు

ఈ ఎన్నికల్లో తమ మద్దతు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికేనని కాపు, బలిజ సంక్షేమ సేవ ప్రకటించింది. మే 13న జరగబోతున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి తీరతామని వారు తెలిపారు. ఈ మేరకు శనివారం చిలకలూరిపేటలో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావును మర్యాదపూర్వకంగా కలసి మద్దతు తెలిపారు. ఐదు సంవత్సరాలుగా కులాల మధ్య వైసీపీ చిచ్చు పెట్టిందన్నారు. ఈ రోజు నుంచి సంక్షేమ సేవ పని చేస్తుందని వారంతా ప్రత్తిపాటికి హామీ ఇచ్చారు.

53 మందిపై బైండోవర్

ఈపూరు, ఏప్రిల్ 20: గ్రామాల్లో శాంతి భద్రతల కోసం బొగ్గారం, గుండేపల్లి, అంగలూరు, ఈపూరు, బొమ్మరాజుపల్లికి చెందిన 53 మందిపై బైండోవర్ నమోదు చేసినట్లు ఈపూరు పోలీస్‌స్టేషన్ రైటర్ రాంబాబు తెలిపారు.

ప్రోగ్రెస్ కార్డు ఆన్‌లైన్ నమోదు ఇబ్బందులు తొలగించాలి: సంపత్‌బాబు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 20: హోలిస్టిక్ ప్రోగ్రెస్‌కార్డు ఆన్‌లైన్ నమోదు ఇబ్బందులు తొలగించాలని ప్యాప్టో పల్నాడు జిల్లా చైర్మన్ బీ సంపత్ బాబు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాల విద్యాశాఖ విద్యార్థులు మార్కులు ఆన్‌లైన్ చేసే విధానంలో ఈ ఏడాది కొత్తగా మార్పులు చేసిందన్నారు. ఈ విధానంలో విద్యార్థుల పరీక్షల మార్కులు నమోదులో ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

ధర్మం కోసం చంద్రబాబు అలుపెరగని పోరాటం

టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన జన్మదిన వేడుకలలో కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 20: రాజకీయ కురుక్షేత్రంలో ధర్మం కోసం అలుపెరగకుండా పోరాడుతున్న వ్యక్తి నారా చంద్రబాబునాయుడని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శనివారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కార్యాలయ ఆవరణలో నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన కొమ్మాలపాటి శ్రీధర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు భారీ కేక్ కట్‌చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న తెలుగు వారందరూ గర్వించదగిన వ్యక్తి నారా చంద్రబాబునాయుడు అన్నారు. పల్నాడు జిల్లాలో తెలుగుదేశం పార్టీ ఏడు నియోజకవర్గాలలో, ఆదేవిధంగా పార్లమెంట్‌ను కూడా కైవసం చేసుకుంటున్నామన్నారు. కాగా నరసరావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ నరసరావుపేట గడ్డమీద తెలుగుదేశంపార్టీ జెండా ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, వెన్నా సాంబశివారెడ్డి, వేల్పుల సింహాద్రి యాదవ్, నూర్జహాన్, టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, కనుమూరి లక్ష్మి, కోసూరి రాధిక, దాసరి ఉదయశ్రీ, కోట నాగసుధీర్, కుమ్మెత కోటిరెడ్డి, కూరపాటి హనుమంతురావు, షేక్ మీరావలి, షేక్ ఆలీ బాష, రాపర్ల జగ్గారావు, గుర్రం నాగపూర్ణచంద్రరావు, గొట్టిపాటి జనార్ధన బాబు, కొట్టా కిరణ్‌కుమార్, నాగోతు సౌరయ్య, కనుమూరి బాజీ చౌదరి, టీడీపీ రాష్ట్రకార్యదర్శి వేల్పుల సింహాద్రియాదవ్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, జీవీ ఆంజనేయులు, మక్కెన తదితరులు

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 20: చిలకలూరిపేటలో మాజీమంత్రి, కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఆయన 74వ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకొని ఐటీడీపీ ఆధ్వర్యంలో 74 కిలోల కేక్ కట్ చేసి పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పార్టీ శ్రేణులతో కలసి ప్రత్తిపాటి కేక్ కట్ చేసి చంద్రబాబుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబు అవసరం ఏంటో అన్ని కులాలు, మతాలు గుర్తించాయన్నారు. అమరావతి, పోలవరం పూర్తి చేయటం ఆయనకు మాత్రమే సాధ్యమన్నారు.

నాదెండ్ల మండలంలో...

నాదెండ్ల, ఏప్రిల్ 20: రాష్ట్రంలో మహిళలు, యువత సాధికారితకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బ్రాండ్ అంబాసిడర్ అని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకట కుమారి, తనయుడు ప్రత్తిపాటి శరత్‌లు పేర్కొన్నారు. శనివారం మండలంలోని తూబాడు, నాదెండ్ల గ్రామాల్లో జరిగిన చంద్రబాబు జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు నెల్లూరు సదా శివరావు, బండారుపల్లి సత్యనారాయణ, దగ్గుమల్లి సాంబశివరావు, నలమోతు హరిబాబు, షేక్ ఖాజావలి, చెన్నుపాటి నాగేశ్వరరావు, కోటి, వెంకటేశ్వర్లు, జ్ఞానరెడ్డి, చిన్నపరెడ్డి, ఇన్నారెడ్డి, నజీర్, సలా ఉద్దీన్, బాలస్వామి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ, ఏప్రిల్ 20: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పుట్టిన రోజు వేడుకలను స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు కూటమి అభ్యర్థులతో కలిసి కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీచేశారు. ఆదేవిధంగా నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకొని విఠంరాజుపల్లి సమీపంలోని బధిరుల పాఠశాల్లో జీవీ ఆంజనేయులు సతీమణి, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి కేక్ కట్‌చేసి విద్యార్థులకు పంపిణీచేశారు. అనంతరం విద్యార్థులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతోపాటు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి నిశంకర శ్రీనివాసరావు, పెండేల శ్రీనివాసరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు అయుబ్‌ఖాన్, మురళీకృష్ణయాదవ్, గోవిందనాయక్‌తోపాటు 32వ వార్డు కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చంద్రబాబు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, వెంకటకుమారి, శరత్, పార్టీ కార్యకర్తలు

బొల్లాపల్లి మండలంలో..

బొల్లాపల్లి, ఏప్రిల్ 20: మండలంలోని వెల్లటూరు, పేరూరుపాడు, బొల్లాపల్లి, వడ్డెంగుంట, రేమిడిచర్ల తదితర గ్రామాల్లో చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా పులిహోర పంపిణీతో పాటు అన్నదానం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నేతలు పెమ్మసాని నాగేశ్వరరావు, జరపాల గోవిందునాయక్, తిప్పిశెట్టి వెంకటేశ్వరరావు, బాదరయ్య, అర్దలపూడి శ్రీనివాసరావు, గుర్రం నరసింహారావు, కాట్ల వెంక టేశ్వర్లు, గంగినేని రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 20: అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని గ్యాస్ కంపెనీల సిబ్బంది, పెట్రోల్ బంకుల సిబ్బంది, సినిమా హాళ్ళ సిబ్బంది, రిలయన్స్, బైక్ షోరూం, కార్ మెకానిక్ సిబ్బంది, ఆంధ్రా పబ్లిక్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులకు వారి వారి రంగాల్లో జరిగే అగ్ని ప్రమాదాలు, వాటి నివారణ పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎస్.శ్రీధర్, నరసరావుపేట అగ్నిమాపక కేంద్ర అధికారి ఎంవీ సుబ్బారావు, అగ్నిమాపక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మునిసిపల్ కౌన్సిలర్ జనసేన పార్టీలో చేరిక

చిలకలూరిపేట, ఏప్రిల్ 20: చిలకలూరిపేట 25వ వార్డు వైసీపీ మునిసిపల్ కౌన్సిలర్ తోట నాగలక్ష్మి శనివారం జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు నాదెండ్ల మనోహర్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. నాగలక్ష్మి భర్త సురేష్, ఆ వార్డుకు చెందిన మరో 30మంది నాయకులు కూడా జనసేనలో చేరారు. వారందరికీ నాదెండ్ల మనోహర్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, చిలకలూరిపేట నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త తోట రాజారమేష్, పార్టీ యువ నాయకులు మండలనేని చరణ్‌తేజ, పట్టణ పార్టీ అధ్యక్షుడు మునీర్‌హసన్, పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి షేక్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.

నేడు మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ

చిలకలూరిపేట, ఏప్రిల్ 20: చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి మైక్రో అబ్జర్వర్లకు ఆదివారం నాదెండ్ల మండలం గణపవరంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి నారదముని శనివారం తెలిపారు. కాగా పోస్టల్ బ్యాలెట్ల దరఖాస్తులను ఈ నెల 26వ తేదీ వరకు స్వీకరించటం జరుగుతుందన్నారు. శనివారం మూడోరోజున నియోజకవర్గంలో ఎవ్వరూ నామినేషన్లు దాఖలు చేయలేదని ఆయన వెల్లడించారు.

అనవేమారెడ్డి కాంస్య విగ్రహం ఏర్పాటు

యడ్లపాడు, ఏప్రిల్ 20: మండలంలోని కొండవీడు కోట అభివృద్ధి కమిటీ సహకారంతో కొండవీడు కోటలో రెడ్డిరాజు అనవేమారెడ్డి కాంస్య విగ్రహాన్ని శనివారం ఏర్పాటుచేశారు. 13 అడుగుల కాస్యం విగ్రహాన్ని సుమారు రూ.12 లక్షల వ్యయంతో నిర్మించారు. విగ్రహాన్ని కోటలో నాలుగు రోడ్లు కలిసే కూడలిలో పర్యాటకులను ఆకర్షించేలా ఏర్పాటుచేశారు. ఫైబర్ మెటీరియల్‌తో ఏర్పాటుచేసిన ఈ విగ్రహానికి పగుళ్ల రావటంతో దానిస్థానంలో కొత్తగా కాంస్య విగ్రహం ఏర్పాటు చేసినట్టు అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి తెలిపారు.

5వ తరగతిలో ప్రవేశానికి మరో అవకాశం

వినుకొండ, ఏప్రిల్ 20: బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల్లో 5వ తరగతిలో చేరడానికి ప్రవేశపరీక్ష రాసి సీటు రాని విద్యార్థినులకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు వినుకొండ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కోటమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినుకొండ గురుకుల పాఠశాల్లో సీటు వచ్చి వేరే స్కూల్‌లో సీటు కావాలి అనే విద్యార్థులకు, వేరే స్కూల్‌లో సీటువచ్చి వినుకొండ స్కూల్‌లో సీటు కావాలనే వారికి ఈ నెల 26వ తేదీన రామకృష్ణాపురంలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ బాలికల పాఠశాలలో సంప్రదించాలన్నారు. మార్పులకు అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు.